# వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

గురువారం 12 జనవరి 2023


## వైఎస్ఆర్ సమాధి వద్ద నివాళులర్పించిన ఏపీసీసీ అధ్యక్షుడు రుద్రరాజు



వేంపల్లె, జనవరి 11, ప్రభాతవార్త :

దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సమాధి వద్ద ఏపీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు ఘనంగా నివాళులర్పించారు. బుధవారం ఏపీసీసీ మీడియా ఛైర్మన్ డాక్టర్ తులసిరెడ్డితో కలిసి ఆయన వేంపల్లె మండలం ఇడుపులపాయలో ఉన్న వైఎస్ఆర్ ఘాట్ వద్దకు చేరుకుని వైఎస్ఆర్ సమాధి వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివంగత నేత వైఎస్ఆర్ హయాంలో అనేక పదవులు తాను పొందానని తెలిపారు. వైఎస్ఆర్‌తో ఎంతో సన్నిహితంగా ఉండి పార్టీ కోసం పనిచేశానని చెప్పారు. రాష్ట్రం పెద్ద నాయకుడిని కోల్పోయిందని, ఈ సందర్భంగా జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. దివంగత రాజీవ్‌గాంధీ స్ఫూర్తి, వైఎస్ఆర్ ప్రేరణతో తమ లాంటి నవతరం, యువతరం రావడం జరిగిందన్నారు. అలాగే ఈ దేశానికి రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిని చేయాలని వైఎస్ఆర్ తపన పడేవారన్నారు. తాము కూడా అదే లక్ష్యంతో పనిచేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నీలి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, ఉత్తన్న, సత్తార్, బద్రి, రాఘవయ్య, తదితరులు పాల్గొన్నారు.

## నారాయణ పాఠశాలలో సాంస్కృతిక కార్యక్రమాలు



వేంపల్లె, జనవరి 11, ప్రభాతవార్త :

వేంపల్లెలోని నారాయణ ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో బుధవారం సంక్రాంతి ముందస్తు సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి విచ్చేసి సంక్రాంతి పండుగ విశిష్టతను విద్యార్థులకు తెలిపారు. ఎంఈవో వీరారెడ్డి మాట్లాడుతూ ఈ ఆధునిక యుగంలో పండుగ విశిష్టతను పిల్లలకు తెలియజేయడం ఎంతో ముఖ్యమని, ఈ విధంగా సంబరాలు చేసి తెలియజేస్తున్న కరస్పాండెంట్ నారాయణరెడ్డిని ఆయన అభినందించారు. విద్యార్థిని, విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ నారాయణరెడ్డి, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# చిరువ్యాపారుల ఆర్థిక ప్రగతే.. ప్రభుత్వ లక్ష్యం

### జగనన్న తోడు పథకం కింద చిరువ్యాపారుల ఖాతాల్లో నేరుగా జమ

### కలెక్టర్ విజయ్ రామరాజు



కడప, జనవరి 11 ప్రభాతవార్త :

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న "జగనన్న తోడు" పథకం.. చిరు వ్యాపారుల ఆర్థిక ప్రగతికి బాసటగా నిలిచిందని కలెక్టర్ విజయ్ రామరాజు పేర్కొన్నారు. బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి మంత్రులు, సంబందిత ముఖ్య కార్యదర్శులతో కలిసి.. 3వ యేడాది.. "జగనన్న తోడు" పథకం 6వ విడత లబ్ది మొత్తాన్ని లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమచేసే కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బటన్ నొక్కి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ విసి హాలు నుండి జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు తోపాటు.. జేసీ సాయికాంత్ వర్మ, కమలాపురం, మైదుకూరు ఎమ్మెల్యేలు పి.రవీంద్రనాథ్ రెడ్డి, ఎస్. రఘురామిరెడ్డి, ఏపీ కాలుష్య నియంత్రణ మండలి సభ్యులు పాకా సురేష్ లు హాజరయ్యారు. ముఖ్యమంత్రి విసి ముగిసిన అనంతరం.. స్థానిక విసి హాలులో 6వ విడత "జగనన్న తోడు" పథకానికి సంబంధించి జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని 8,240 మంది చిరు వ్యాపారులకు మంజూరయిన రూ.8,24,00,000లతో పాటు 22,366 మంది మహిళలకు మంజూరైన రూ. 49,41,334 ల వడ్డీ రాయితీ మొత్తం మెగా చెక్కును.. గౌరవ అతిథులతో కలిసి కలెక్టర్ విజయ్ రామరాజు లబ్ధిదారులకు అందజేశారు. విసి అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రస్తుతం జగనన్నతోడు కార్యక్రమం ద్వారా పేద చిరు వ్యాపారస్తులకు ఎలాంటి వడ్డీ లేకుండా రూ.10 వేలు అందించడం జరుగుతోందని, ఈ రుణం సంవత్సర కాలంలో వడ్డీ లేకుండా కేవలం రూ. 10 వేలు మాత్రమే తిరిగి చెల్లించేలా ప్రభుత్వం సౌలభ్యం కల్పించిందన్నారు. ఋణం పూర్తయిన తరువాత మరోసారి రూ.10 వేలు తీసుకునే అవకాశం ఉందన్నారు. "జగనన్న తోడు" పథకాన్ని లబ్ధిదారులు సక్రమంగా సద్వినియోగించుకుని తమ వ్యాపారాన్ని వృద్ధి చేసుకుంటూ.. బలోపేతం కావాలని కలెక్టర్ కోరారు. అర్హత ఉండి "జగనన్న తోడు" లబ్ధిని ఇంకనూ ఎవరైనా పొందలేక పోయి ఉంటే.. సంబందిత గ్రామ లేదా వార్డు సచివాలయాల్లో సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. లబ్ధిదారుల ఎంపిక నిరంతరాయంగా సాగే ప్రక్రియ అని.. "జగనన్న తోడు" పథకంకు సంబంధించిన సహాయం, ఫిర్యాదుల కోసం జిల్లా కేంద్రంలో సంబందిత డీఆర్డీఏ, మెప్మా అధికారులను గానీ.. లేదా.. రాష్ట్ర ప్రభుత్వ టోల్ ఫ్రీ నెంబర్: 1902 కు గానీ కాల్ చేయవచ్చన్నారు. అనంతరం హాజరైన చిరు వ్యాపారులను ఉద్దేశించి.. ఎమ్మెల్యేలు పి.రవీంద్రనాథ్ రెడ్డి, ఎస్.రఘురామిరెడ్డిలు మాట్లాడుతూ... గతంలో తన సుదీర్ఘ పాదయాత్రలో రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది చిరువ్యాపారులు పడుతున్న ఆర్థిక ఇబ్బందులను ప్రత్యక్షంగా చూసిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి.. వారి ఆర్థిక పరిస్థితిని మెరుగు పరిచే దిశగా.. "జగనన్న తోడు" ద్వారా.. ఆర్థిక సాయాన్ని అందించడం జరుగుతోందన్నారు. రాష్ట్రంలో ప్రతి చిరువ్యాపారి, సాంప్రదాయ చేతి వృత్తుల వారికి, హస్త కళాకారులకు.. ఆర్థికంగా ప్రగతి బాటలో నడిపించడమే.. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అన్నారు. "జగనన్న తోడు" ద్వారా అందించే ఆర్థిక సాయం చిరు వ్యాపారుల జీవితాల్లో వెలుగులు నింపుతుందని, వారి ఆర్థిక ప్రగతికి ఆసరాగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మెప్మా, డిఆర్డీఏ పిడిలు రామ్మోహన్ రెడ్డి, పెద్దిరాజు, సంబందిత సంక్షేమ శాఖల అధికారులు, బ్యాంకు అధికారులు, స్వయం సహాయక సంఘ మహిళా సభ్యులు, జగనన్నతోడు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## చిరు వ్యాపారులకు బాసటగా నిలుస్తున్న జగనన్న తోడు

-చిరు వ్యాపారులకు 10వేల వడ్డీ లేని రుణాలు

-జగనన్న తోడుతో చిరు వ్యాపారుల ముఖంలో చిరునవ్వులు

-జిల్లా కలెక్టర్ గిరీషా పిఎస్



రాయచోటి, జనవరి11 ప్రభాతవార్త

జగనన్న తోడు చిరు వ్యాపారులు, సంప్రదాయ వృత్తులవారికి బాసటగా నిలుస్తోందని జిల్లా కలెక్టర్ గిరీషా పిఎస్ పేర్కొన్నారు. బుదవారం జగనన్న తోడు 6వ విడతలో భాగంగా చిరు వ్యాపారులకు వడ్డీలేని రుణాలు, జగనన్న తోడు పథకం ద్వారా రుణాలు పొంది సకాలంలో చెల్లించిన వారికి వడ్డీ రియంబర్స్‌మెంట్‌ను రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లి క్యాంప్ కార్యాలయం నుంచి కంప్యూటర్ బటన్ నొక్కి నేరుగా లబ్దిదారుల ఖాతాలకు జమ చేసే బృహత్తర కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న తోడు పథకం 6వ విడత జిల్లాలో మొత్తం 11134 మంది లబ్దిదారులకు ఒక్కొక్కరికి పది వేలు చొప్పున 11.13 కోట్లు రూపాయలను లబ్దిదారులకు జమచేయడం జరిగిందన్నారు. జగనన్న తోడు పథకం కింద రుణాలు పొంది సకాలంలో చెల్లించిన 19687 మందికి 47.19 లక్షలు వడ్డీ రియంబర్స్‌మెంట్ కింద లబ్దిదారులకు జమ. రాష్ట్ర ప్రభుత్వం చిరు వ్యాపారులకు ఎల్లవేళలా అండగా ఉంటుందని తెలిపారు. ఈ డబ్బును అనవసరమయిన అవసరాలకు ఉపయోగించకుండా తీసకున్న అవసరాలకు మాత్రమే ఖర్చు చేసి ఆర్థికాభివృద్ధి చెందాలన్నారు. ఈ సందర్బంగా లబ్దిదారులకు జిల్లా కలెక్టర్, మున్సిపల్ ఛైర్మన్ చేతులు మీదుగా మెగా చెక్కను అందజేశారు. అనంతరం పొదుపు సంఘాల మహిళలు తయారు చేసిన తినుబండారాలు, తదితర వాటిని కలెక్టర్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ ఫయాజ్‌బాష, డిఆర్‌డిఏ పిడి సత్యనారాయణ, ఎల్ డిఎం వెంకటేశ్వరరెడ్డి, లబ్దిదారులు, తదితరులు పాల్గొన్నారు.

## చెరువు ఆక్రమణకు అడ్డుకట్ట వేసేదెవరు?

### చేతులెత్తేసిన ఇరిగేషన్ అధికారులు



కబ్జా చేసి రూములు నిర్మించిన చిత్రం

నందలూరు, జనవరి 11 ప్రభాతవార్త

మండలంలోని కన్యకచెరువు ఆక్రమణ భాగోతం కొనసాగుతూనే ఉంది. దీనిపై ఫిర్యాదు చేసినా, సమాచారం ఇచ్చినా పట్టించుకొనే స్థితిలో ఇరిగేషన్ అధికారులు ఉండకపోవడం దారుణం. అక్రమణ పరంపర కొనసాగుతున్నప్పటికి సమాచారం అందించిన ఏమి జరుగుతుందో తెలియని స్థితిలో ఉన్నారు ఇరిగేషన్ అధికారులు, మండలంలో భూ ఆక్రమణలపై వచ్చినటువంటి వార్తలను స్పందించిన జిల్లా కలెక్టర్ భూకబ్జాదారులపై కఠినచర్యలు తీసుకొనేందుకు వెనుకాడేదే లేదని మండలస్థాయి అధికారులకు సూచనలు జారీ చేసినా ప్రస్తుతం జరుగుతున్నటువంటి భూకబ్జాలకు అధికారులు వత్తాసు పలుకుతున్నారా? అనే సందేహం ప్రజల్లో కలుగుతోంది. ఎక్కడ ఖాళీ జాగా కనపడితే చాలు అక్కడ పాగా వేయడం షరామామూలే అయ్యింది. నువ్వు వేస్తే నేను వెయ్యనా అన్న రీతిలో మారిపోయింది. దీనికితోడు నాయకుల అండదండలు చూసుకొని భూకబ్జాదారులు విర్రవీగిపోతున్నారు. ఇంత జరుగుతున్నప్పటికి ఇరిగేషన్ అధికారులకు ఈ విషయం తెలియదా అంటే సమాదానం లేదు. వచ్చాం వెళ్లాం అన్నరీతిలో ఉన్నారు ఇరిగేషన్ అధికారులు, నివాసాలు ఎక్కడో ఉంటారు. సమాచారం అందించిన వచ్చి సమస్యను పరిష్కారం చేయలేకపోతున్నారంటే ఎంత ఉద్యోగ భద్రతలో ఉన్నారో అర్థమవుతోంది. ఈ విషయంపై మండల ఇరిగేషన్ అధికారిని వివరణ కోరగా తహశీల్దారు ద్వారా తమకు లేఖ రావాలని వచ్చిన తర్వాత దానిపై స్పందిస్తామని టూకీగా సమాధానం చెప్పడం చూస్తుంటేనే అర్థమవుతోంది. సమస పైన ఎంత అవగాహన ఉందో ఆ అధికారికి. రాజకీయ ఒత్తిళ్లు జరుగుతున్నాయా? ఏవరేమి చేసుకొంటే మాకేంటి అని ఉన్నారో అనుకొంటున్నారు ప్రజలు ఇదేవిధంగా కొనసాగితే రెండు మూడేళ్లలో చెరువు పూర్తిగా కనుమరుగైపోతుందని, కాలువలపై చెరువులను ఆక్రమించి నిర్మాణాలు యదావిధిగా కొనసాగుతున్నాయని ప్రజలు అంటున్నారు. దీనిపై అధికారులు వస్తున్నారు, చూస్తున్నారే తప్ప సమస్యల పరిష్కారదిశగా అడుగులు వేయడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. పేదవారికి ఒక సెంటు స్థలం ఇచ్చేందుకు ఎన్నో రకాలైనటువంటి ఇబ్బందులు కలిగిస్తున్నారు అధికారులు. ఇటువంటి భూకబ్జాదారులు ఆక్రమణలు చేసి నిర్మాణాలు చేపడుతుంటే అధికారులు చోద్యం చూస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. ఈ విషయమై తహశీల్దారును వివరణ కోరగా తన దృష్టికి వచ్చిన విషయాన్ని వెంటనే ఇరిగేషన్ అధికారికి, పోలీసులకు సమాచారం అందజేశానని, ఇరిగేషన్ అధికారుల ద్వారానే ఆ నిర్మాణాలను ఆపగలమని ఆయన అన్నారు. దీన్నిబట్టి చూస్తుంటే ఇరిగేషన్ అధికారులు ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో అర్థమవుతోంది. తహశీల్దారు సమాచారం అందజేసినప్పటికి, పత్రికల్లో వచ్చినప్పటికి స్పందించకపోవడం ఏమిటో మరి అర్థం కావడంలేదు. ఇప్పటికైనా దీనిపై స్పందిస్తారో లేక గాలికొదిస్తారో వేచి చూడాల్సిందే.

# వివోఏల చేతివాటం...!

### -రుణాల మంజూరుకు అక్రమ వసూళ్లు...!!

### -నీరుగారుతున్న స్వయం సహాయక సంఘాల ఉద్దేశం....!!!



రాయచోటి, జనవరి11, ప్రభాతవార్త

గ్రామీణ ప్రాంతాల్లో ఉండే స్వయం సహాయక సంఘాల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని వివోఏలు రెచ్చిపోతున్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు బ్యాంక్‌ల ద్వారా రుణాల మంజూరు విషయంలో చేతివాటం ప్రదర్శిస్తున్నారు. మంజూరైన రుణానికి అనుగుణంగా ఆయా స్వయం సహాయం సంఘాల మహిళలు నుంచి కమీషన్‌లు గుంజుతున్నారు. అధికారులకు తెలిసినా చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మహిళలు ఆర్థికంగా సాధికారత సాధించడమే లక్ష్యంగా కొన్నేళ్ల క్రితం ఏర్పాటు చేసిన స్వయం సహాయక సంఘాల ఉద్దేశం నీరుగారుతోంది. వీవోఎల అతి జోక్యానికి తోడు రాజకీయ మకిలి అంటుకోవడంతో ఇవి కూడా దారి తప్పుతున్నాయి. ముఖ్యంగా బ్యాంక్ రుణాల విషయంలో వివోఏల పెత్తనం మితిమీరిపోవడంతో అర్హులైన వారికి రుణాలు అందకుండా పోతున్నాయి. బ్యాంక్ లింకేజి రుణం మంజూరు విషయంలో పెద్ద ఎత్తున్న వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. రుణం ఇవ్వడానికి నిరాకరించిన గ్రూపులపై వివిధ రూపాల్లో ఒత్తిడి తెచ్చి తమ పబ్బం గడుపుకుంటున్నారు. ఇప్పటికైనా గ్రామాల్లో పని చేసే వివోఏల ఆగడాలపై దృష్టి సారించాలని మహిళా సంఘాలు అభ్యర్థిస్తున్నాయి. పేదరిక నిర్మూలనతో పాటు మహిళలు ఆర్థికంగా ఎదగాలని సదుద్దేశంతో దాదాపు రెండు దశాబ్దాల క్రితం స్వయం సహాయక సంఘాలకు అప్పటి టీడిపి ప్రభుత్వం అంకురార్పణ చేసింది. ఆ సంఘాలకు రుణాలు ఇప్పించే బృహత్తర బాద్యతను ప్రభుత్వం డిఆర్‌డిఏకు అప్పగించింది. తొలుత పదివేలు నుంచి 40వేల రూపాయల వరకు రుణాలు ఇవ్వగా రిజర్వ్ బ్యాంక్ ఆదేశాల మేరకు ఎలాంటి సెక్యూరిటీ లేకండా 20లక్షల రూపాయల వరకు సంఘాలకు రుణం మంజూరవుతుంది. మహిళా సంఘాలు క్రమం తప్పకుండా వాయిదాలు చెల్లించడంలో విజయం సాధించడంతో రుణాలు లభ్యత సంఘాకు విపరీతంగా పెరిగింది.

**అవగాహన లేకపోవడంతో.....**

గ్రామీణ ప్రాంతాల్లో ఆ సంఘాల్లో ఉండే మహిళలు ఎక్కువ శాతం మంది నిరక్ష్య రాస్యులు లేక ఆర్థిక లావాదేవీలపై అవగాహన లేనివారు కావడంతో వారికి సహాయకారిగా ఉండడానికి ప్రభుత్వం కొన్ని సంఘాలను క్లబ్ చేసి వాటికి ఒక విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్ ను నియమించింది. రుణాలు మంజూరు పర్యవేక్షణ బాధ్యతలను వారికి అప్పగించింది. వారికి 3900 రూపాయల గౌరవ వేతనం కూడా ప్రభుత్వం అందిస్తుంది. దీంతో పాటు ఒక్కో వివోఏ సంఘం నుంచి 2వేల రూపాయలు గ్రూపు నుంచి లభిస్తుంది. ఆర్థిక లావాదేవుల సవ్యంగా ఉంటే అదనంగా మరికొంత జీతం వారు పొందేలా కూడా ఆదేశించింది.

**నియామకాలే వరంగా.....**

ఆరంభంలో సవ్యంగా పనిచేసిన వివోఏలు రాను రాను అడ్డదారులు తొక్కారు. సంఘాల సంభ్యులకు అవగాహన లేక లేని ఆసరాగా తీసుకుని వారిపై పెత్తనానికి అలవాటుపడ్డారు. ముఖ్యంగా రుణాలు మంజూరుతో పాటు ప్రభుత్వం అందించే వివిధ సంక్షేమ పథకాలలో కూడా వీరి పాత్ర కీలకంగా మారడంతో ప్రతి పనికి ఒక రేటు పిక్స్ చేసి ఆ మొత్తం ముట్ట చెబితేనే పనిచేస్తామనే విధంగా వారి పనితీరు ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. వీరిపై రాజకీయ ప్రభావం కూడా పడడంతో అధికార పార్టీ కనుసన్నల్లో పనిచేస్తూ వారు చెప్పిన వారికి రుణాలు పథకాలు అందిస్తూ అర్హులయిన చాలామందికి మొండి చేయి చూపిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వీటి మంజూరులో ఐదు లక్షల నుంచి 20లక్షల రూపాయల వరకు రుణాలు మంజూరు చేస్తుంటాయి. వీటి మంజూరులో వివోఏలదే కీలక పాత్ర దీంతో ఒక్క సంఘం నుంచి 3వేల నుంచి 4వేల రకు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక్కొ వివోఏ పరిధిలో ప్రతి ఏడాది సగటున (మిగతా Vవ పేజీలో)

## రాష్ట్రంలో అవినీతి అరాచక పాలన నడుస్తోంది

### ముస్లీం మైనార్టీలు టీడిపిలోకి వలసలు : మాజీ ఎమ్మెల్యే రమేష్‌కుమార్ రెడ్డి



రామాపురం.జనవరి11 ప్రభాతవార్త

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అవినీతి, అరాచక, నియంతృత్వ, అక్రమ పాలనను సాగిస్తున్న వైసిపి ప్రభుత్వంను త్వరలోనే గద్దె దింపుదామని రాయచోటి నియోజవకర్గ టిడిపి ఆన్‌చార్జ్ ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుదవారం మండలంలోని నీల కంఠరావుపేటలో ముస్లీం మైనార్టీలు ఆద్వర్యంలో మన రాష్ట్రానికి ఇదేమి కర్మ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని వైసిపి ప్రభుత్వం కొనసాగిస్తున్న అరాచకాల గురించి ప్రజలకు వివరించారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గత టీడిపి హయాంలో ముస్లీం మైనార్టీలకు అందేటువంటి దుల్హన్ పథకం, రంజాన్‌తోపా, మసీదుల్లో పనిచేస్తే మౌజామ్‌లక జీతాలు ఇవ్వడం తదితర పథకాలను లేకుండా చేశారని ఆరోపించారు. ఈ ప్రభుత్వంలో రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసి మైనార్టీలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ఇదేమి కర్మ కార్యక్రమంలో భాగంగా నీల కంఠరావుపేట గ్రామానికి చెందిన ముస్లీంలు 10 కుటుంబాలు రమేష్‌కుమార్‌రెడ్డి సమక్షంలో బుదవారం చేరారు. ఈ సందర్భంగా ముస్లీంలు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ముస్లీంలకు ఎలాంటి పథకాలు అందక తమకు న్యాయం జరగలేదని ఈ విషయంపై టీడిపి ప్రభుత్వం వస్తే తమకు అన్ని రకాలుగా అభివృద్ధి జరుగుతుందని తాము తెలుగుదేశం పార్టీలో చేరుతున్నామని తెలిపారు. ఈ ప్రభుత్వంలో ఇలాంటి అరాచక పాలన ఇంతవరకు మేము చూడలేదని బ్రిటీష్ పాలనను జగన్‌మోహనరెడ్డి కొనసాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్‌యార్డు ఛైర్మన్ రమేష్‌రెడ్డి, టిడిపి మండల మైనార్టీ నాయకుడు మహబూబ్‌బాష, గడికోట భాస్కర్‌రెడ్డి, ఎంఎల్ వెంకట్రామిరెడ్డి, రవిశంకర్‌రెడ్డి, తెలుగుయువత ఉపాద్యక్షులు దివ్యకుమార్‌రెడ్డి, నాగబూషణ్‌రెడ్డి, చెన్నూరు బాబు, నజీర్, షేక్ నియాజ్ తదితరులు పాల్గొన్నారు.

## మాన్యం భూములు ఆక్రమణ

### లక్ష్మీపాలెంలో తామరమడుగు కనుమరుగు

### దేవస్థాన భూములు స్వాహా!

### ఆక్రమణదారులకు రెవిన్యూ కార్యాలయంలో కార్పెట్లు

### పట్టించుకోని అధికారులు

### చర్యలు తీసుకోవడంలో వెనకడుగు!

బద్వేలు, జనవరి 11 ప్రభాతవార్త :

బద్వేలులో ప్రభుత్వ భూములే కాకుండా దేవాలయ భూములు కూడా ఆక్రమించే వారికి రెవిన్యూ కార్యాలయంలో కార్పెట్లు పరిచి సపర్యాలు చేస్తుండటం చూస్తుంటే ఇంత మర్యాద కబ్జాదారులకు ఉంటుందా? అన్నట్లుగా కనపడుతుంది. ప్రసిద్ది చెందిన లక్ష్మీపాలెం దేవస్థానానికి సంబంధించిన భూములను ఆక్రమించి దర్జాగా తిరుగుతున్న అలాంటి వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలున్నాయి. దాదాపు 30 ఎకరాలు లక్ష్మీపాలెం దేవస్థానం భూములు ఉన్నప్పటికీ వాటిలో తామరమడుగు భూములు ప్రసిద్ధి చెందినవి. ఆనాడు మట్లి రాజులు నిర్మించిన లక్ష్మీపాలెం దేవస్థానంలో తిరుమల తిరుపతిలో ఉన్న మూల విరాట్ లక్ష్మీపాలెం దేవస్థానం ప్రతి రూపం కలిగి ఉంటుంది. ప్రసన్న వెంకటేశ్వర స్వామికి పూజలు నిర్వహించేందుకు ప్రత్యేకంగా తామరమడుగు భూమిలో పండిన తామర పుష్పాలతో పూజలు నిర్వహించేవారు. అలా ఆనవాయితీగా కొన్ని సంవత్సరాలుగా వెంకటేశ్వర స్వామికి తామర పుష్పాలతో పూజలు చేపట్టారు. కానీ విలువైన తామర మడుగు భూమి కబ్జా చేసేందుకు లక్ష్మీపాలెంకు చెందిన ఒక వ్యక్తి ప్రత్యేకంగా దృష్టి పెట్టి కొద్ది కొద్దిగా తామర మడుగును ఆక్రమించడమేగాక, నేడు పూర్తిగా తామర మడుగును కనపడకుండా చేసిన సంఘటన లక్ష్మీపాలెంలో చోటు చేసుకుంది. అయితే వీటితో పాటు లక్ష్మీపాలెం దేవస్థానం భూములు ఆక్రమణకు గురికావడమేగాక (మిగతా Vవ పేజీలో)

## అంతర్‌జిల్లా గంజాయి స్మగ్లర్లు అరెస్ట్

- రూ.40లక్షలు విలువ చేసే 30 కేజీలు గంజాయి స్వాధీనం

- 3 కార్లు, 5 సెల్‌ఫోన్లు, 7 నకిలీ 500 నోట్లు స్వాధీనం- విలేకరుల సమావేశంలో ఎస్పీ అన్బురాజన్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ అన్బురాజన్, గంజాయిని పరిశీలిస్తున్న ఎస్పీ

కడప క్రైం, జనవరి 11, ప్రభాతవార్త:

దువ్వూరు మండలం, గుడిపాడు సమీపంలో ఉన్న సబ్ స్టేషన్ వద్ద గంజాయి అక్రమ కొనుగోలు మరియు అమ్మకం, దొంగ నోట్ల చలామణి చేస్తున్న ఐదు మందిని బుధవారం అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ తెలిపారు. ఈ మేరకు వివరాలను స్థానిక పెన్నార్ కాన్ఫరెన్స్ హాలులో విలేకరుల సమావేవంలో వెల్లడించారు. తన పర్యవేక్షణలో మైదుకూరు సబ్ డివిజన్ పోలీసు అధికారి వంశీధర్‌గౌడ్ సూచనల మేరకు మైదుకూరు రూరల్ సీఐ నరేంద్రరెడ్డిలకు రాబడిన పక్కా సమాచారంతో ఐదు మందిని అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు. వారి వద్ద నుంచి 30 కేజీలు గంజాయి, 3 కార్లు, 5 సెల్‌ఫోన్లు, 7 నకిలీ రూ.500 నోట్లు స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. గంజాయి విలువ సుమారు రూ.40లక్షలు ఉంటుందన్నారు. అరెస్టు కాబడిన ముద్దాయిలు పశ్చిమగోదావరి జిల్లా, బ్రాహ్మణగూడెం గ్రామానికి చెందిన ఎం.నవీన్‌కృష్ణ, కర్నూలు జిల్లా, ముకుందాపురం గ్రామానికి చెందిన జి.హరి, నంద్యాల జిల్లా చాగమర్రికి చెందిన బి.బాబాఫకృద్దీన్, దువ్వూరు మండలం నారాయణపల్లి గ్రామానికి చెందిన జి.మునిరెడ్డి, కర్నూలు జిల్లా ఆలమూరు మండలం చిత్రేనిపల్లె గ్రామానికి చెందిన జే.నడిపి ఓబులేసులుగా పేర్కొన్నారు. వీరిపై గతంలో కూడా పలు కేసులు ఉన్నాయన్నారు. ముద్దాయిలను అరెస్టు చేయడంలో ప్రతిభ కనబరిచిన మైదుకూరు డీఎస్పీ వంశీధర్ గౌడ్, రూరల్ సీఐ నరేంద్రరెడ్డి, దువ్వూరు పోలీసు స్టేషన్ ఎస్.ఐ రాఘవేంద్రరెడ్డి, వారి సిబ్బంది, సబ్ డివిజనల్ క్రైం పార్టీ సిబ్బందిని ఎస్పీ అభినందించడంతో పాటు వారికి రివార్డులు కూడా అందజేస్తామన్నారు. విలేకరు ల సమావేశంలో ఏఎస్పీ తుషార్‌డూడి, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## రాజంపేట ఆర్‌డిఓ బదిలీ?

### భూకుంభకోణాలే కారణమా?

### రాజంపేటకు సబ్‌కలెక్టర్‌ను నియమించే అవకాశం



రాజంపేట అర్బన్, జనవరి 11 ప్రభాతవార్త

రాజంపేట ఆర్‌డిఓ కోదండరామిరెడ్డి బదిలీ అయినట్లు విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది. బుధవారం రాత్రి బదిలీ ఉత్తర్వులు సిద్ధమైనట్లు సమాచారం. గత మూడు నెలలుగా రాజంపేట, నందలూరు మండలాల్లో భూకుంభకోణాలు భారీగా చోటు చేసుకొన్నాయి. ప్రభుత్వ భూములను ఇష్టారాజ్యంగా స్వాధీనం చేసుకోవడం, అమ్ముకోవడం జరుగుతోంది. నిషేదిత భూములను కూడ ఆక్రమించి అమ్ముకోవడం లాంటి సంఘటనలు బయటపడ్డాయి. అధికారపార్టీకి చెందిన నేతలతో పాటు పైరవీలతో భూములను భారీగా ఆక్రమించడం జరిగింది. రాజంపేట నియోజకవర్గంలోని వందల ఎకరాల భూములు కబ్జాకు గురయ్యాయి. ప్రధానంగా రాజంపేట, నందలూరు (మిగతా Vవ పేజీలో)

## ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి



ప్రొద్దుటూరు జనవరి 11, ప్రభాతవార్త

ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధి లోని 9వ వార్డు శ్రీనివాసనగర్‌లో నిర్వహిం చిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్య క్రమంలో టిడిపి కార్యకర్తలు మరియు ముఖ్యనాయకులతో టీడీపీ ఇంఛార్జి జివి ప్రవీణ్ కుమార్ రెడ్డి తోపాటు వార్డులో పెద్ద ఎత్తున ప్రజలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ రెడ్డి గారు అందరినీ కలుపుకుని ఇంటింటికి తిరు గుతూ ప్రజలు పడుతున్న ఇబ్బందులు అడిగి తెలుసుకోవటం, రాబోయే రోజుల్లో తెదేపా అధికారంలోకి వస్తుందని మీ కష్టాలకు పరిష్కారం ఉంటుందని ధైర్యం చెప్పి ముందసాగారు. కార్యక్రమంలో 9వార్డు కరీముల్లా, భూన్, టింబర్ డిపో షఫీ, సుర సుర శ్రీనివాసులు, పట్టణ అధ్యక్షుడు ఇవి సుధాకర్ రెడ్డి, రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి నల్ల బోతుల నాగరాజు, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి సుంకర వేణుగోపాల్, 14వ వార్డు మస్తాన్, గోలే కరిముల్లా, కడప పార్లమెంటు కార్యదర్శి తెలుగు యువత యమ్మ నూరు ఆంజనేయులు, పెన్నా నగర్ మజీద్, 13వ వార్డ్ నాయబ్ పాల్గొన్నారు.

## అనుమతుల పేరుతో అడ్డగోలుగా మట్టి తరలింపు

- నిబంధనలు తుంగలో తొక్కిన ఇరిగేసన్ అధికారులు - పర్యవేక్షణ లోపంతో మట్టి మాఫియా ఇష్టారాజ్యం

- రాత్రిళ్లు కూడా ఇటుకల బట్టీలకు మట్టి తరలింపు



ఓబులవారిపల్లె, జనవరి 11, ప్రభాతవార్త:

అనుమతుల పేరుతో అడ్డగోలుగా చెరువు మట్టి తవ్వకాలు. రాత్రి పగలు తేడా లేకుండా అడ్డు అదుపు లేకుండా మట్టి మాఫియా కాంట్రాక్టర్లు తమ పని తాము కానిచ్చేస్తున్నారు. సోమవారం ఓబులవారిపల్లె మండలం జిల్లెల్ల మండలం పరిధిలో ఇరిగేషన్ అధికారులు నామమాత్రంగా చేసిన 2, 3 బాక్సు గీతలు చూపించి చదునైన సారవంతమైన భూమిలో ఇష్టానుసారం గుంతలు పెట్టి యంత్రాలతో మట్టిని తోడి రాత్రిళ్లు కూడా ఇటుకల బట్టీలకు తరలిస్తున్నారు. వీటిని పర్యవేక్షించాల్సిన అధికారులు పత్తా లేరనే ఆరోపణలు మెండుగా ఉన్నాయి. రోజుకు కొంత భూభాగంతో కొన్ని క్యూబిక్ మీటర్లు తీసుకోవాలనే నిబంధనలుండేవి. ఆ నిబంధనలు అటు కాంట్రాక్టర్లు, ఇటు అధికారుల అలసత్వంతో మట్టి మాఫియా ఆడిందే ఆట, పాడిందే పాటగా సాగడంతో పాటు వారి వ్యాపారాలు 3 పువ్వులు, 6 కాయలుగా విరాజిల్లుతున్నాయి. ఇరిగేషన్ అధికారులు దగ్గరుండి మట్టిని తరలించేటప్పుడు పర్యవేక్షించే వారు లేరని చెప్పవచ్చు. చెరువులో ఎక్కడ పడితే అక్కడ గుంతలు తవ్వడం వల్ల వర్షాకాలం నీరు నిండి చిన్న పిల్లలు, పశువులు గుంతలో పడి మృత్యువాతపడుతున్నారని రైతులు, ప్రజలు ఆరోపిస్తున్నారు. ఏది ఏమైనా అనుమతులు ఒక చోట, పనులు మరో చోట సాగిస్తూ సారవంతమైన మట్టిని తరలిస్తున్నారని ముదినేపల్లె గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. రాత్రింబవళ్లు లారీల రాకపోకలతో రోడ్డుపై దుమ్ము, దూళి అధికమై దుమ్ముకాలుష్యంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. మట్టి తోలే వారు నీటిని చల్లి రోడ్లపై దుమ్ము లేయకుండా చర్యలు తీసుకోలేదని పలువురు వాపోతున్నారు. ఏది ఏమైనా ఇరిగేషన్ అధికారుల ఆచూకీ (మిగతా Vవ పేజీలో)

## అందరికీ అందుబాటులో ఆర్టీసీ కార్గో సేవలు

కొండాపురం, జనవరి 11, ప్రభాతవార్త :

అందరికీ అందుబాటులో ఆర్టీసీ కార్గో సేవలు కొండాపురంలో ప్రారంభించినట్లు నిర్వాహకుడు లింగేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఆర్టీసీ కార్గో సేవలు వేగవంతమైన, ఉత్తమ రవాణాకు ఎప్పుడూ అందుబాటులో ఉంటాయని, ప్రజలకు మరింత సౌకర్యంగా ఉంటుందని, గ్రామీణ ప్రజలకు అందుబాటులో ఉండాలన్న ఉద్దేశంతో మండలస్థాయిలో కూడా కార్గో సేవలు ఉండాలని కొండాపురంలోని సీఎంఆర్ కాంప్లెక్స్ వద్ద ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఏపీఎస్ఆర్టీసీ లాజిస్టిక్స్ పేరుతో వస్తువులు రవాణా చేస్తూ ప్రజలకు సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రజల కోసం బుకింగ్, రిసీవింగ్ కౌంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా తక్కువ ఖర్చుతో ఏపీ, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుండి కూడా ఆర్టీసీ రవాణా సేవలు అందుతాయన్నారు. వేగవంతమైన, సురక్షితమైన రవాణా, నమ్మకమైన వస్తు సరఫరా, అతి తక్కువ ఖర్చుతో గమ్యస్థానాలకు వస్తువులు చేరతాయని ఆయన అన్నారు. దీనిని కొండాపురం మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా లింగేశ్వర్‌రెడ్డి కోరారు.

## రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

పులివెందుల, జనవరి 11, ప్రభాతవార్త :



రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు వేంపల్లెలోని ఆర్‌పిఎస్ఆర్ క్రికెట్ అకాడమీకి చెందిన పి.కాత్యాయని, పి.బాలాజి, క్రిష్ణ, అహమ్మద్ ఖిఆర్ మన్సూరీ, ఎం.అక్షిత రెడ్డి (యు14) అనే ఐదుగురు క్రీడాకారులు ఎంపికయ్యారు. పుల్లంపేట లోని ఎస్‌జీఎఫ్ఐ అండర్-19 క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొని ప్రతిభ చూపారు. ఈనెల 11 నుండి 13వరకు మచిలీపట్నంలో జరగబోయే అండర్-19 ఎస్‌జీ ఎఫ్ఐ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. వీరి ఎంపిక పట్ల ఆర్‌పీఎస్ఆర్ క్రికెట్ అకాడమీ ఛైర్మన్ రామిరెడ్డి, విశ్వనాథరెడ్డి, ట్రెజరర్ మాధవరెడ్డి, కోచ్ షరీఫ్ పఠాన్, పీఆర్ఎల్ బస్ యజమాని ప్రభాకర్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

## కోవరంగుట్టపల్లె పాఠశాలలో సంక్రాంతి సంబరాలు

పులివెందుల, జనవరి 11, ప్రభాతవార్త :

సింహాద్రిపురం మండలంలోని కోవరంగుట్టపల్లె ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు అంగడి నాగేంద్ర ఆధ్వర్యంలో బుధవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఇందులో భాగంగా పాఠశాలల్లో చిన్నారులు, మహిళా ఉపాధ్యాయులు కలిసి రంగవల్లులు వేశారు. చిన్నారులు గొబ్బెమ్మలు తయారు చేసి పూజలు చేశారు. పాటలు పాడి, చిన్నారులకు భోగి పండ్లు వేసి ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భాస్కర్, ప్రశాంతి, లక్ష్మిగౌరి, జ్యోతి, విద్యాకమిటి ఛైర్మన్ గంగామహేష్, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

## పండుగలు సాంప్రదాయాలకు ప్రతీకలు

పులివెందుల రూరల్, జనవరి 11, ప్రభాతవార్త :



పండుగలు సాంప్రదాయాలకు ప్రతీకలు అని లయోలా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఫాదర్ అమల్‌రాజ్ అన్నారు. కళాశాలలో ఉమెన్ సెల్ ఆధ్వర్యంలో బుధవారం సంక్రాంతి ముందస్తు సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ కమీషనరు నరసింహారెడ్డి హాజరై వివిధ రకాల పోటీలలో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపల్ ఆంటోనిపాల్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## పంట సంరక్షణే కీలకం

పులివెందుల రూరల్, జనవరి 11, ప్రభాతవార్త :



రైతులు సాగుచేసిన పంటలను సంరక్షిండమూ కీలకమేని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు ఏడుకొండలు, జయమ్మ తెలిపారు. పులివెందులలోని ఆహార విజ్ఞానశాస్త్ర, సాంకేతిక కళాశాల విద్యార్థులు జాతీయ సేవా పథకంలో భాగంగా ఆరో రోజు బుధవారం వేముల మండలంలోని ఎద్దులయేనెలో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమంలో నిర్వహిం చారు. గ్రామంలోని అన్ని వీధులలో క్రిమిసంహారక మందులు పిచికారి చేశారు. చెట్లు, నీరు, చదువు, పర్యావరణం, కాగితపు కవర్ల వాడకం గురించి నినాదాలు చేశారు. గ్రామం అంతా తిరుగుతూ ర్యాలీ చేశారు. రైతుల పొలాల సంరక్షణ కోసం, వాళ్ల పండించే పంటలకు సలహాలిస్తూ పంటల సంరక్షణ ప్రాముఖ్యత గురించి మండల వ్యవసాయాధికారి చెన్నారెడ్డి, ఉద్యాన అధికారి దత్తారెడ్డి సలహాలు, సూచనలు ఇచ్చారు.

## ఎన్ఐటిటిఆర్‌తో మిట్స్ ఎంఓయు

కురబలకోట, జనవరి 11 ప్రభాతవార్త:



చెన్నైలోని కేంద్ర ప్రభుత్వసంస్థ అయిన నేషనల్ ఇన్స్ట్యూట్ఆఫ్ టెక్నికల్ టీచర్స్ ట్రైనింగ్ అండ్ రీచర్చ్‌తో మిట్స్ కళాశాల అవగాహన ఒప్పందం చేసుకొన్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. చెన్నైలోని ఎన్ఐటిటిఆర్‌లో జరిగిన ఒప్పందం కార్యక్రమంలో మిట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.యువరాజ్ ఎన్ఐటిటిఆర్ ఛైర్మెన్ వివిఎస్.కుమార్ డైరెక్టర్ డాక్టర్ విశాల్ నటేషన్‌లు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ద్వారా విద్యార్థుల కోసం కేరీర్ టెక్నికల్ పరం గా శిక్షణలో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు చేయడం విద్యార్థులకు ఇంటర్న్‌లషిప్ లు అందించడం జరుగుతోందని ఈ ఒప్పంద ముఖ్య ఉద్దేశమని ప్రిన్సిపాల్ తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఐటిటిఆర్ సిబ్బంది, మిట్స్‌కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామనాథన్, కోఆర్డినేటర్ డాక్టర్ అరుణ్‌లు పాల్గొన్నారు.

## సూక్ష చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుకు రుణాలు

కురబలకోట, జనవరి 11 ప్రభాతవార్త:



సూక్ష్మ చిన్నతరహా పరిశ్రమలు ఏర్పాటు చేసుకునే పొదుపు సంఘాల సభ్యులకు ప్రభుత్వం సబ్సిడీ రుణాలు మంజూరు చేస్తోందని మాస్టర్ ట్రైనర్ టి.హేమాద్రి తెలిపారు. బుధవారం మండల శ్రీశక్తి కార్యాలయంలో మహిళా పొదుపు సంఘాల సభ్యులకు సూక్ష్మ చిన్నతరహా పరిశ్రమలపై అవగాహన కార్యక్రమంలో శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొదుపు సంఘాల సభ్యులకు సీడ్ క్యాప్టల్ ద్వారా వ్యాపార స్థాపన, వ్యాపార అభివృద్ధి, విస్తరణలకు ప్రభుత్వం సబ్సిడీ రుణాలు, ప్రోత్సాహకాలు, అనుమతులు, ఆహార శుద్ధి పరిశ్రమల స్థాపనకు తీసుకోవాల్సిన ట్రేడింగ్‌పై అవగాహన కల్పించారు. ఈ అవగాహన కార్యక్రమంలో డిఆర్‌డిఏ ప్రాజెక్టు మేనేజర్ జవహర్‌బాషా, అసిస్టెంట్ మేనేజర్ నీరజ, కోఆర్డినేటర్లు, వెలుగు సిబ్బంది, ఏపిఎం నీరజ, సిసిలు డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

## సాంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి



కురబలకోట, జనవరి 11 ప్రభాతవార్త: సాంస్కృతిక సాంప్రదాయాలకు సంక్రాంతి పండగ ప్రతీక అని జీవీఐసి విద్యాసంస్థల ఛైర్మెన్ ఎన్‌వి.రమణారెడ్డి అన్నారు. బుధవారం గోల్డన్‌వ్యాలీ, సిబిఎస్ఈ మోడల్ హైస్కూల్‌లో సంక్రాంతి సంబరాలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంప్రదాయ దస్తులను ధరించి ఈ సంబరాల్లో పాల్గొన్నారు. విద్యార్థుల తలలపై బోగిపళ్ళను వేసి ఆశీర్వదించారు. విద్యార్థులకు రంగవళ్ళి ముగ్గుల పోటీలు నిర్వహించారు. పొంగళ్లను వండారు. ముగ్గల పోటీల విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గురుకుల పాఠశాలలో సంక్రాంతి సంబరాలు

పీలేరు, జనవరి 11 ప్రభాతవార్తః



డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో సంక్రాంతి సంబరాలు శ్రీలత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భోగి మంటలు, ముగ్గుల పోటీ, సాంస్కృతిక కార్య క్రమాలు పిల్లలను అలరించాయి. ఈ కార్య క్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రసాద్, విజయ్‌కుమార్, వాణి, సుజాత, అంజ లి, జయశ్రీ, ఉమాదేవి, లీలావతి, ఉపాధ్యాయులు, విద్యార్తులు

## యానాదులకు ప్రత్యేక కార్పోరేషన్ ఏర్పాటు చేయాలి

కేవి.పల్లె, జనవరి 11 ప్రభాతవార్తః



గిరిజన యానాదులకు ప్రత్యేక కార్పోరేషన్ ఏర్పాటు చేయాలని ఏపీజీ వైఎస్ఎస్ అనుబంధ సంస్థ వెన్నెల కంటి రాఘవయ్య గిరిజన యానాదుల ఆశయ సాధనకు సొసైటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దాలి ఇజ్రాయేలు అన్నారు. బుధవారం స్థానిక మండలం గోరంట్లపల్లె గ్రామం కంబిరెడ్డిగారిపల్లె ఎస్టీ కాలనీలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రజా సంకల్పయాత్రలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే గిరిజన యానాదులకు ప్రత్యేక కార్పోరేషన్ ఏర్పాటుచేస్తామని హామీ ఇచ్చారని అన్నారు. ఆంధ్రప్రదేశ్ గిరిజన యానాది సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గడ్డం శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గిరిజనుల అభివద్ధికి ఆమడ దూరంలో ఉన్నారని వారికి అభివద్ధి వైపు నడిపించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని అన్నారు. 35 గిరిజన తెగలు అంతరించి పోయే ప్రమాదం ఉందని అన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాం తాల నుంచి వచ్చిన గిరిజన యానాది రాష్ట్ర నాయకులు పులిశ్రీనివాసులు కంబిరెడ్డిగారిపల్లె ఎస్టీ కాలనీలో తన గృహంలో పరామర్శించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గిరిజన యానది సంఘ రాష్ట్ర కోశాధికారి రెడ్డెప్ప, సిద్దయ్య, రాఘ వయ్య, రామలింగయ్య, పోలయ్య, సంజీవ రావు, చెన్నకేశవులు, వెంకటేశ్వర్లు, మహిళాసభ్యురాలు రాచూరి గౌరీ

## ఎస్టీ ఎస్సీ కేసు నమోదు

కేవి.పల్లె,జనవరి 11 ప్రభాతవార ః

మండలంలో కేవిపల్లె పంచాయతీ రాములవారిపల్లెకు చెందిన మహేష్‌రెడ్డి, రాజారెడ్డి, రెడ్డెప్పరెడ్డిలపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదుచేసినట్లు ఎస్సై లోకేష్ తెలిపారు. కంబంవారిపల్లె పంచాయతీ మిషన్ వద్ద ఉన్న స్థల విషయమై దిండువారిపల్లెకు చెందిన భాస్కర్‌తో గొడవ పడ్డారు. వీరు అతనికి సంబంధిం చిన స్థలం తమదని అడ్డుపడ్డారు. ఈవిషయమై వాదోపవాదాలు జరిగాయి. ఈసందర్భంగా నిందితులైన మహేష్‌రెడ్డి, రాజారెడ్డి, రెడ్డెప్పరెడ్డి భాస్కర్‌ను కులం పేరుతో దూషించారని ఆయన చెప్పారు. భాస్కర్‌కు సంబంధించిన పూర్వీకులు ఈ స్థలంలో గతంలో ఈ స్థలాన్ని కొనుగోలు చేశారని పూర్వీకులు ఇక్కడ నివసిస్తున్నారని తెలిపారు.

## వైకాపా విజయానికి కృషి చేయాలి

కేవి.పల్లె, జనవరి 11 ప్రభాతవార్తః



వైకాపా విజయానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పీలేరు మాజీ ఎమ్మెల్యే జీవి. శ్రీనాథరెడ్డి అన్నారు. మండలంలోని గర్నిమిట్టలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కార్యకర్త ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు గురించి వివరించాలని అన్నారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన అందరికి అందజేయాలని తెలిపారు. అర్హత ఉన్నవారిని వాలంటీర్లు గుర్తి ంచి వారికి పథకాలు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు గజ్జల శ్రుతి, ఎంపీపీ ఈశ్వరమ్మ, మండల కన్వీనర్ వెంకట రమణారెడ్డి, యువజన కన్వీనర్ గజ్జల శీనురెడ్డి, వైకాపా నాయకులు పాల్గొన్నారు.

## దశ దిశాలేని పాలనతో దగా అవుతున్న జనం

వాల్మీకిపురం, జనవరి 11 ప్రభాతవార్తః



రాష్ట్రంలో దశ దిశాలేని పాలకుల పాలనతో నిత్యావసర సరుకుల ధరలు చార్జీలు పెరిగిపోయి జనం దగా అవుతున్నారని మండల తెదేపా అధ్యక్షులు మల్లి కార్జునరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కూరపర్తిలో ఇదేం ఖర్మ, మనరాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో తెదేపా నాయకులతో కలిసి ర్యాలీ నిర్వహించి వైకాపా ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేసి అవగాహన కల్పించారు. అనంతరం గ్రామస్తులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ బాధ్యతలేని వైకాపా ప్రభుత్వ పాలనలో నిత్యావ సర సరుకుల ధరలు, విద్యుత్,బస్సు చార్జీలు పెరగడంతో సగటు కుటుంబం విపరీతంగా పెరిగిపోయి నిరుపేద ప్రజల జీవనం భారంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి కష్టారెడ్డి, సూరి, చంద్రమౌళి, సీనియర్ నాయకులు సయ్యద్‌బాషా, హనీఫ్, మస్తాన్ ఆది, బాషా పాల్గొన్నారు.

## హిందూ సాంప్రదాయాలను పరిరక్షించాలి

వాల్మీకిపురం, జనవరి 11 ప్రభాతవార్తః



రోజురోజుకు అంతరించిపోతున్న మన హిందూ సాంప్రదాయాలను పరిరక్షించు కోవాల్సిన బాధ్యత నేటితరం విద్యార్థులపై ఉందని ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ప్యారంపల్లె ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ముందస్తు సంక్రాంతి, భోగి పండుగలను నిర వ్యహించి విద్యార్థులకు సాంప్రదాయ పద్దతులపై అవగాహన కల్పించారు. కట్టు, బొట్టు, నడవడికలకు పెద్ద పీఠ వేస్తు విద్యార్తులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రపంచంలోనే మన హిందూ సాంప్రదాయం గొప్పదని మన పూర్వీకుల పద్ధతులను మనం పాటించినప్పుడే మన విలువలను కాపాడుకోగలుగుతున్నామన్నారు. అనంతరం పాఠశాల ఆవరణంలో సంక్రాంతి పండుగ, భోగి, పశువుల పండుగలను నిర్వహించారు. ఉపాధ్యాయులు బాలాజీ, కమిటీ ఛైర్మన్ శ్రీనివాసులురెడ్డి, ఎంపీటీసీ లలితమ్మ, వార్డు మెంబరు శ్రీనివాసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో ఆంగ్లంపై పట్టు పెంచండి

వాల్మీకిపురం, జనవరి 11 ప్రభాతవార్తః




డిగ్రీ కళాశాలలో చదువు కుంటున్న విద్యార్థుల్లో ఆంగ్లంపై పట్టు పెరిగేలా అధ్యాపకులు చర్యలు తీసుకోవాలని కడప ఆర్జేడీ బాబు అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఎన్టీఆర్ డిగ్రీ కళాశాలను ఆయన ఆకస్మికంగా తనికీ చేశారు. ఈ సంద ర్భంగా రికార్డులను పరిశీలించిన అనంతరం అధ్యాపకుల సమావేశం ఏర్పా టు చేసి న్యాక్, ఎఫ్ఆర్ఎస్, ఫియాప్ అంశాలపై సలహాలు సూచనలు చేశారు. ప్రస్తుత పరిస్తితులలో విద్యార్థులు పోటీ పరీక్షలకు ఇంటర్వ్యూలకు హాజరైతే విజయం సాధించే విధంగా వారిలో ఆంగ్లంపై పట్టు పెంచాలని సూచించారు. తదుపరి విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కళాశాలలో పోలీసు ఉద్యోగాలకు ఉచిత శిక్షణతో పాటు హైదరాబాదుకు చెందిన వెంకట రమణ ఆధ్వర యంలో విద్యార్థులకు ఆంగ్లంపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. ఈ శిక్షణ కార్యక్రమాలను పరిశీలించిన ఆర్జేడీ, శిక్షకుడిని, అధ్యాపకులను ప్రశంసించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కష్ణమూర్తి, అధ్యాపకులు పెద్దప్పరాజు, శ్రీనివాసులు, రాఘవరెడ్డి, రేణుక, విజయలక్ష్మి, సుదర్శన్, జ్యోతి, నజీముద్దాన్, హితావుల్లాఖాన్, సుబ్రమణ్యం కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## న్యాయ విజ్ఞాన సదస్సులు సద్వినియోగం చేసుకోవాలి

కడప లీగల్, జనవరి 11, ప్రభాతవార్త:

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జీ ఎస్.కవిత బుధవారం చెన్నూరు మండలంలో ఉన్న బెస్తకాలనీలో, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో, ఖాజీపేట మండలం పునీల్ లారెన్స్ ఓల్డేజ్ హోంలో న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీనియర్ సిటిజన్ చట్టం, వినియోగదారు చట్టాలు, కన్స్యూమర్ ప్రొటెక్షన్ యాక్ట్ 2019, పర్యారవణ పరిరక్షణ, పీసీ అండ్ పీఎన్‌డీటీ యాక్ట్ అంశాలను వివరించారు. 181 ఉమెన్ హెల్ప్‌లైన్, 1098 చైల్డ్ హెల్ప్‌లైన్, 100 పోలీసు హెల్ప్‌లైన్, 14567 సీనియర్ సిటిజన్స్ హెల్ప్‌లైన్ టోల్ ఫ్రీ నంబర్లపై అవగా హన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో విమల హెడ్మాస్టర్, ఉపాధ్యాయులు, విద్యార్థినిలు, మహిళలు, పారా లీగల్ వాలంటరీ అరుణకుమారి, కుమారి, అరుణ, పునీత్ లారెన్స్ ఓల్డేజ్ హోం ప్రతినిధులు, సీనియర్ సిటిజన్స్ పాల్గొన్నారు.

## తంబళ్లపల్లెలో టీడీపీ నేత ఇంట్లో సోదా

తంబళ్లపల్లె, జనవరి 11, ప్రభాతవార్త:



తంబళ్లపల్లె మండలంలో తెదేపా నేత కొండ్రెడ్డి ఇంట్లో సోదాపై వార్త సంచలనమైంది. బుధవారం మదనపల్లి రూరల్ సీఐ శివాంజనేయులు నేతృత్వంలో ఎస్ఐలతో పాటు సుమారు 30 మంది పోలీసులు తొలుత తహసీల్దార్ కార్యాలయంలో కొండ్రెడ్డి ఇంటిని సోదా చేయడానికి తహసీల్దార్ అనుమతి కోసం వచ్చిన సమయానికి ఎవరూ లేక పోవడంతో కొండ్రెడ్డి ఇంటికి వెళ్లి మీ ఇంట్లో మారణాయుధాలు ఉన్నట్లు సమాచారం వచ్చింది సోదా కోసం వచ్చామని సహకరించాలని కొండ్రెడ్డి భార్యను కోరారు. సీఐ సొంత పూచీకత్తు, పత్రం కొండ్రెడ్డి భార్య జడ్పీటీసీ గీతారెడ్డికి ఇవ్వడంతో ఆమె సోదాకు అంగీకరించారు. గంటల పాటు సోదా చేసి కొండ్రెడ్డి ఇంట్లో పోలీసులు ఊహించినట్లు ఎలాంటి ఆధారాలు దొరక్క పోవడంతో ఉసూరు మంటూ వెళ్లి పోయారు. కొండ్రెడ్డి ఇంటి సమీపంలోని గృహాల్లోని జనాలు పోలీసులు హడావిడి చూసి బెంబేలెత్తారు.

## చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు

వాల్మీకిపురం, జనవరి 11 ప్రభాతవార్తః




సంక్రాంతి పండుగను పురస్కరిం చుకుని గ్రామాల్లో కోడిపందేలు, పేకాట చట్ట వ్యతిరేక కార్య కలాపాలకు పాల్పడితే ఎంతటివారైనా కఠిన చర్యలు తప్పవని స్థానిక సీఐ సురేష్ అన్నారు. బుధవారం స్థానికంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లా డుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా ఎక్కడైనా చట్ట వ్యతిరేక కార్యక్రమాలు జరుగుతుంటే ప్రజలు తమకు నేరుగా సమాచారం అందివ్వాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. కార ్యక్రమానికి ప్రభుత్వ అనుమతులు లేవని ముఖ్యంగా గ్రామాలలో ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై బిందు మాధవి, పోలీసులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో ఉపాధి పనులు చేపట్టాలి

దువ్వూరు, జనవరి 11, ప్రభాతవార్త:



మండలంలోని 23 గ్రామ పంచాయతీల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా కూలీలకు పనులు కల్పించాలని ఏపీవో రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి హామీ పథకంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రస్తుతం వ్యవసాయ పనులు చివరి దశలో ఉన్నాయని సంక్రాంతి తరువాత ప్రజలకు, రైతులకు అవసరమైన పనులు పూర్తి చేయాలన్నారు. ఉపాధి హామీ పనులకు చెందిన 7 రికార్డులు నమోదు చేయాలన్నారు. మస్టర్‌లలో ఎటువంటి తప్పులు ఉండరాదని, పని చేసే చోట ఫొటోలు తీసి అప్‌లోడ్ చేయాలన్నారు. ఈ సమీక్షలో ఈసీ విజయ్ కుమార్, క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

## 30 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం

దువ్వూరు, జనవరి 11, ప్రభాతవార్త:



మండల పరిధిలోని భీమునిపాడు వద్ద 30బస్తాలు రేషన్ బియ్యాన్ని, బొలెరో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రాఘవేంద్రరెడ్డి తెలిపారు. రాబడిన సమాచారం మేరకు భీమునిపాడు వద్ద రేషన్ బియ్యాన్ని బొలెరోలో తరలిస్తుండడంతో సిబ్బందితో దాడులు చేశామన్నారు. బొలెరో వాహనంలోని 30 బస్తాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. బొలెరో వాహనంతో పాటు రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని అల్లాడుపల్లెకు చెందిన మారం దానం అనే వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## శాశ్వత జాతీయ జెండా ఆవిష్కరణ

పీలేరు, జనవరి 11 ప్రభాతవార్తః



పీలేరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో 55 అడుగులు గల జాతీయ జెండాను పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ప్రారంభించారు. బుధవారం స్తానిక గ్రామ పంచాయతీ కార్యలయంలో ప్రత్యేక పూజలు చేసి అనంతరం జెండాను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎక్కడా లేని విధంగా ఉండటం అభినందనీయం అన్నారు. అనంతరం పీలేరు గ్రామ పంచాయతీలో నూతనంగా మంజూరైన నూతన పెన్షన్లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇచ్చిన మాటకు కట్టుబడి మూడో విడత రూ.2750లు పెన్షన్లు పెంచిన ఘనత సీఎంకే దక్కిందన్నారు. భారత దేశంలో ఏరాష్ట్రంలో లేని విధంగా పెన్షన్లు పంపిణీ కార్యక్రమం చేపడు తున్నారన్నారు. దీర్ఘ కాలిక వ్యాధి గ్రస్తులకు రూ.5వేల నుంచి రూ.10వేలు వరకు పెన్షన్లు పొందుతున్నారని తెలిపారు. పెన్షన్‌దార్లు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మైనారిటీ కార్పోరేషన్ ఛైర్మన్ ఇక్బాల్ అహ్మద్, సర్పంచి డాక్టర్ హబీబ్‌బాషా, జడ్పీటీసీ రత్నశేఖర్‌రెడ్డి, మండల కన్వీనర్ జగన్ మోహన్‌రెడ్డి, నాయకులు హుమయూన్, ఎన్‌వి. చలపతి, మహితా ఆనంద్ పాల్గొన్నారు.

## బీసీల జనగణనపై సీఎంకు గిడుగు సవాల్

కడప ఏడురోడ్లు, జనవరి 11, ప్రభాతవార్త:



కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులుగిడుగు రుద్రరాజు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బీసీల జన గణన చేసే సత్తా ఉందా అంటూ సవాల్ విసిరారు. హాత్‌సే హాత్ మిలావో యాత్ర ద్వారా రాహుల్ గాంధీ జోడో యాత్రకు సంఘీభావంగా ఆయన స్ఫూర్తితో జనవరి 26 నుంచి మార్చి 26 వరకు ప్రతి నియోజకవర్గంలో ప్రతి మండల స్థాయిలో రాష్ట్ర వ్యాప్తంగా పాదయాత్ర చేపట్టనున్నామన్నారు. జిల్లా కార్యకర్తల సమావేశం నిర్వహించి నియోజకవర్గాల వారీగా సమీక్షలు జరిపి కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసు కొచ్చేందుకు ప్రతి ఒక్క కార్యకర్త సైనికుడిగా పని చేయాలని అందుకు కాంగ్రెస్ పార్టీ ప్రతి ఒక్కరికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజుతో పాటు ఏఐసీసీ సెక్రటరీ సీడీ మెయప్పన్, పీసీసీ మీడియా ఛైర్మన్ డా.నర్రెడ్డి తులసిరెడ్డి, ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతం, ఏపీసీసీ కోఆర్డినేషన్ కమిటీ మెంబర్ శ్రీరామ మూర్తి, జిల్లా అధ్యక్షుడు నీలి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే కమలమ్మ, ఎన్ఎస్‌యూఐ యూత్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్ నేతలు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

## సంక్రాంతికి ఎల్‌హెచ్ఎం వినియోగించుకోవాలి

ప్రొద్దుటూరు క్రైం, జనవరి 11, ప్రభాతవార్త:

సంక్రాంతి పండగ సందర్భంగా సొంత ఊర్లకు లేదా వేరే ఊర్లకు సెలవుల్లో వెళ్లే ప్రజలు దొంగతనాలు నివారించడానికి పోలీసు సేవలలో భాగమైన ఎల్‌హెచ్ఎంను వినియోగించుకోవాలని సంబంధిత పోలీసు అధికారులు తెలిపారు. ఎల్‌హెచ్ఎం కెమెరా సదుపాయాన్ని వినియోగించుకొని సంక్రాంతి సందర్భంగా దొంగతనాల నివారణలో పోలీసులకు సహకరించాలని కోరుతున్నామన్నారు. ఎల్‌హెచ్ఎం సేవలకు కమాండ్ కంట్రోల్ ఫోన్ నెంబర్ 9121100702ను సంప్రదించవచ్చన్నారు.

## తంబళ్లపల్లెను పరిశ్రమల ఖిల్లాగా మారుస్తాం

### - జిల్లా పరిశ్రమల శాఖాధికారి నాగరాజు

తంబళ్లపల్లె, జనవరి 11, ప్రభాతవార్త:



తంబళ్లపల్లె నియోజకవర్గాన్ని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు పరిశ్రమల ఖిల్లాగా మార్చ డానికి తమ వంతు సహకారం అందిస్తామని జిల్లా పరిశ్రమల శాఖాధికారి నాగరాజు హామీ ఇచ్చారు. బుధవారం ఐకేపీ ఏపీఎం గంగాధర్ ఆధ్వర్యంలో జరిగిన ప్రధాన మంత్రి ఉపాధి కల్పన (పీఎంఈజీపీ) కార్యక్రమంలో జిల్లా అధికారి మాట్లాడుతూ 18 ఏళ్లు పైబడిన వారికి ఓసీ జనరల్‌కు 25శాతం, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వికలాంగులు, ఎక్స్ ఆర్మీలకు 35శాతం సబ్సిడీతో రుణాలు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. ఈ రుణాలు ప్రతి ఒక్కరూ సేవా రంగంలో ఆవులు, గొర్రెలు, మేకలు, కోళ్ల పెంపకం ఇలాంటి వారికి గరిష్టంగా 20 లక్షలు, ఉత్పత్తి రంగంలో చిన్న వ్యాపారాలు, పేపర్ ప్లేట్లు తయారీ, బ్యూటీ పార్లర్, ప్రింటింగ్ ప్రెస్, బ్రిక్స్ ఇండస్ట్రీ, సిమెంట్ బ్రిక్స్ ఇలాంటి రంగాలకు రూ.50లక్షలు వరకు రుణాలు మంజూరు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అనసూయ, నారాయణరెడ్డి, ఎమ్మెస్ కమిటీ సభ్యులు, సీసీలు, సంఘమిత్రలు పాల్గొన్నారు.

## వెన్నెల పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు

కమలాపురం, జనవరి 11, ప్రభాతవార్త:



కమలాపురం పట్టణంలోని వెన్నెల ఇంగ్లీషు మీడియం పాఠశాలలో బుధవారం పాఠశాల ఆవరణలో పండగ వాతావరణ సంతరించుకుంది. పచ్చటి తోరణాలు కట్టి, రంగు రంగుల ముగ్గులు వేసి అలంకరించారు. తెలుగుదనం ఉట్టి పడేలా సంప్రదాయ దుస్థులలో పిల్లలు, ఉపాధ్యాయులు ముస్తాబయ్యారు. ఈ కార్యక్రమంలో మన సంస్కృతీ సంప్రదాయాలు నిర్వహించడం ద్వారా తెలియజేయవచ్చన్నారు. పిల్లల అలంకరణలు, పాఠశాల ఆవరణలోని పండగ వాతావరణం చూసి పలువురు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాధవి, పాఠశాల ఉపాధ్యాయినీలు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. ముందుగా విద్యార్థినిలకు ముగ్గుల పోటీలు, ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు.

## క్రికెట్ క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు టోర్నమెంట్

### టిడిపి నాయకులు చమర్తి జగన్‌మోహన్‌రాజు

ఒంటిమిట్ట జనవరి11 ప్రబాతవార్త:

క్రికెట్ క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు టోర్నమెంట్ ఉపయోగపడు తుందని రాజంపేట టిడిపి నాయకులు చమర్తి జగన్‌మోహన్‌రాజు పేర్కోన్నారు. బుధవారం మండలంలోని మలకాట్‌పల్లి లో మండల స్దాయి క్రికెట్ టోర్నమెంట్ ను నిర్వహించారు. టోర్నమెంట్ ప్రారంబోత్సవానికి ఆయన విచ్చేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లడుతూ యువత, విద్యార్దుల్లో క్రీడాలద్వారా సానుకూల దృక్పదం ఏర్పడుతుందని, గెలుపోటములు స్వీకరించే గుణం సత్తా చాటాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రస్తుతం సాంకేతిక రంగంలో యువత క్రీడలకు దూరం ఆవుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.యువత ఆవకాశం వచ్చినప్పుడు సద్వినియెగం చేసుకోవాలన్నారు. ఆంతుకుముందుగాక్రీడాకారులను పరిచయం చేసుకున్నరు. కార్యక్రమంలో రాష్ట్ర కల్లు గీత కార్మికుల కార్పొరేషన్ మాజీ డైరక్టర్ కొమరా వెంకటసరసయ్య, మండల పార్టీ మాజీ ఆద్యక్షుడుకుమారి ఎల్లారెడ్డి బిసిసెల్ రాష్ట్ర కార్యదర్శి సమ్మెట శివప్రసాద్,మండల నాయకులు హరినాద్‌రెడ్డి, మామిళ్ళ శ్రీహరి, శివారెడ్డి, బివీరమణ, లక్ష్మినారాయణరెడ్డి, సుబ్బారెడ్డి, శ్రీనివాసులరెడ్డి, బొడిచర్ల శ్రీనివాసులు,మల్లికార్జున,బాలకృష్ణ, మాచుపల్లి హరి , షఫీ, నఫీల్లా,రంతుల్లా, చాన్‌బాషా, సూర్యనారాయణరాజు, సురేష్‌కుమార్, సుదర్శన్, వినోద్‌రెడ్డి పాల్గోన్నారు.

## కోదండరాముని సన్నిధిలో రుద్రరాజు



ఒంటిమిట్ట జనవరి11 ప్రభాతవార్త: స్దానిక కోదండరామాలయాన్ని బుధవారం ఉదయ ం రా ష్ట్ర కాంగ్రెస్‌పార్టీ ఆద్యక్షుడు గిడుగు రుద్రరాజు సందర్శించారు. ఈ సందర్బంగ ఆలయ ఆర్చకులు వీణరాఘవాచార్యులు, మనోజ్‌కుమార్ స్వాగతం పలికి ఆలయ మర్యాదలు చేశారు. రాజంపేట కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి సోమిశెట్టి మనోహర్‌బాబు ఆద్వ ర్యంలో కాంగ్రెస్‌పార్టీ ఆద్యక్షుడు రుద్రరాజు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆనంతరం ఆర్చకులు వీణరాఘవాచార్యులు ఆలయ చరిత్రగురించి వివరించారు తరువాత తీర్ధ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్య క్రమంలో ఏఐసిసి ప్రదాన కార్యదర్శి మయ్యప్పన్, పిసిసి వర్కి ంగ్ ప్రసి డెంట్ జంగాగౌతమ్, నాగ మదుయాదవ్, రామూర్తి, బాలకృష్ణ, జిల్లా కాం గ్రెస్ పార్టీ ఆద్యక్షుడు నీలి శ్రీనివాసులు, శ్రీరాములు, కోవెలకుంట్ల శ్రీనివాసులు పాల్గొన్నారు.

## విక్టరి పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు

రైల్వేకోడూరు రూరల్, జనవరి 11 ప్రభాతవార్త



రైల్వేకోడూరు పట్టణంలోని విక్టరి పాఠశాలలో బుధవారం అధినేతలు విక్టరి నరసింహారెడ్డి, విక్టరి రామక్రిష్ణారెడ్డిల ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు చేసిన సంక్రాంతి ముగ్గులు చూపరులను ఆకట్టుకొనే విధంగా రూపొందించారు. తమ పాఠశాలలో ప్రతియేటా సంక్రాంతి పండుగలను విద్యార్థుల ద్వారా ప్రాంతీయత కు చిహ్నాలుగా నిర్వహిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యా యులు మహ్మద్, బాలాజి, చిన్నయ్య, రాము పాల్గొన్నారు.

## డాల్ఫిన్‌డేల్ పాఠశాలలో ముందస్తు సంక్రాంతి వేడుకలు

రైల్వేకోడూరు రూరల్, జనవరి 11 ప్రభాతవార్త



రైల్వేకోడూరు పట్టణంలోని డాల్ఫిన్‌డేల్ పాఠశాలలో ముందస్తు సంక్రాంతి వేడుకలను పాఠశాల అధినేత పంజం సుకుమార్‌రెడ్డి నేతృత్వంలో నిర్వహిం చారు. ఈ సందర్భంగా పాఠశాల అధినేత పంజం సుకుమార్‌రెడ్డి మాట్లాడుతూ డాల్ఫిన్‌డేల్ పాఠశాల స్థాపించినప్పటి నుంచి అన్ని పండుగలను ఘనంగా నిర్వహిస్తున్నామని, ముఖ్యంగా ప్రాంతీయతకు చిహ్నాలుగా పండుగలను నిర్వహిస్తున్నామని పాఠశాల విద్యార్థులకు గంగిరెద్దుల ఆట, కోడిపందేలు తదితర వాటిపై ప్రత్యేక కదారంగాన్ని ఏర్పాటు చేసి ముందస్తు సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధినేతలు పంజం సుకుమార్‌రెడ్డి, సుజని, బాలాకుమార్, పాఠశాలకు చెందిన విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## అప్రూవల్ లేని లేఅవుట్లపై చర్యలు తీసుకోండి

### అధికారుల సమీక్షలో ఆర్డీఓ ఎంఎస్.మురళి



మదనపల్లె, జనవరి 11 ప్రభాతవార్త :

ప్రభుత్వ అనుమతులు లేని అక్రమ లేవుట్లపై చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ ఎంఎస్.మురళి తెలిపారు. బుధవారం పికేఎం ఉడా అర్బన్ డెవలెప్‌మెంటు కార్యాలయంలో చిత్తూరుజిల్లా ఉమ్మడి పట్టణ, గ్రామీణ ప్రణాళిక అధికారులతో పికేఎం ఉడా ఛైర్మెన్ వెంకటరెడ్డి యాదవ్‌తో కలసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ పట్టణాల్లో, గ్రామాల్లో వేసే ప్రతి లేవుట్‌లను పరిశీలించి అప్రూవల్ లేవుట్లుగా ఉండేలా రియల్టర్లకు నోటీసులు జారీ చేయాలన్నారు. ముఖ్యంగా వ్యవసాయని వ్యవసాయేతర భూమిగా మార్చి లేవుట్లను అప్రూవల్‌గా చేసుకోవా లన్నారు. లేవుట్లలో 10శాతం భూమిని ప్రజా ప్రయోజనాలకు గానూ స్థలం కేలాయించి లేవుట్లలో అన్ని మౌళిక వసతులు కల్పించాలన్నారు. ఉడా ఛైర్మెన్ వెంకటరెడ్డియాదవ్ మాట్లాడుతూ లేవుట్లకు సంబంధించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి లేవుట్‌లోనూ బెటర్‌మెంటు చార్జీలు వసూలు చేసి ప్రభుత్వ ఆదాయానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా టౌన్ ప్లానింగ్ అధికారి మధు, డిపిఓ ధనలక్ష్మి, ప్రణాళిక అధికారులు పాల్గొన్నారు.

## ప్రతి ఇంటికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు : ఎమ్మెల్యే

మదనపల్లె, జనవరి 11 ప్రభాతవార్త :



పార్టీలకతీతంగా అర్హులుగా ఉన్న ప్రతి ఇంటికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు మంజూరు చేయనున్నట్లు ఎమ్మెల్యే నవాజ్‌బాషా తెలిపారు. బుధవారం పట్టణంలోని 29వ వార్డు ఎస్‌బిఐ కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఈ సందర్భంగా నవరత్నాల బుక్‌లెట్‌ను గడప గడపకు తీసుకెళ్ళి లబ్దిదారులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హులుగా ఉన్న వారికి నవరత్నాల పథకాలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ముఖ్య మంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ 98శాతం నెరవేర్చడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మున్సి పల్ ఛైర్‌పర్సన్ మనూజారెడ్డి, కౌన్సిలర్లు డిష్ రామక్రిష్ణారెడ్డి, వసీం అక్రం, రాజేష్, ప్రసాద్, ఎస్‌వి.రమణ, రామిశెట్టి శివయ్య, శారదారెడ్డి, నాయకులు ఇర్ఫాన్‌ఖాన్, బాలగంగాధర్‌రెడ్డి, రహీం, కరుణాకర్‌రెడ్డి, చంద్రశేఖర్‌నాయుడు పాల్గొన్నారు.

## వైకాపా ప్రజావ్యతిరేక విధానాలపై ప్రచారం

మదనపల్లె, జనవరి 11 ప్రభాతవార్త :



వైకాపా ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాల పట్ల గ్రామాల్లో కార్యకర్తలు ప్రజలకు అవగాహన కల్పించి ప్రచారం చేయాలని తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ నాయకులు శ్రీరామనేని జయ రామ్‌నాయుడు తెలిపారు. బుధవారం రూరల్ మండలంలోని సిటిఎం గ్రామ పంచాయితీ రెడ్డివారిపల్లెలో కార్యకర్తలతో కలసి పర్యటించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ నాలుగేళ్ళుగా వైకాపా అరాచకపాలనతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వచ్చే 2024 ఎన్నికల్లో టిడిపిని ఆదరించి ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడును గెలిపించాలని కోరారు. టిడిపి గెలుపే మనకు ప్రధాన ధ్యేయం అన్నారు. అనంతరం గ్రామస్థులతో కలసి శ్రీకోదండరామస్వామి ఆలయంలో పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు రాజగోపాల్, చంద్రయ్య, శ్రీరాములు, క్రిష్ణమూర్తి, పెంచుపాడు స్వామి, ముద్దుక్రిష్ణయ్య పాల్గొన్నారు.

## పరీక్షా కేంద్రాలను పరిశీలించిన డిఎస్‌పి



మదనపల్లె, జనవరి 11 ప్రభాతవార్త :

పోలీస్ కానిస్టేబుల్స్ ఎంపికలకు సం బంధించి ఈనెల 22న నిర్వహించే రాత పరీక్షా కేంద్రాలను బుధవారం డిఎస్‌పి కేశప్ప పరిశీలించారు. పట్టణంతో పాటు రూరల్ మండలంలో ఏర్పాటు చేసిన 20పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన పరీక్ష కేంద్రంలో ఉండాల్సిన మౌళిక వసతుల గురించి అడిగి తెలుసుకొన్నారు. కేంద్రాల వద్ద ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని కళాశాల యాజమాన్యాలను ఆదేశిం చారు. కార్యక్రమంలో ఆయన వెంట వన్‌టౌన్ ఇన్‌చార్జ్ సిఐ సాదిక్‌అలీ, రూరల్ సిఐ సత్యనారాయణ, ఎస్ఐలు చంద్రశేఖర్, హరహరిప్రసాద్ పాల్గొన్నారు.

## జ్ఞానాంభిక కళాశాలకు నాక్ గుర్తింపు



మదనపల్లెక్రైం, జనవరి 11 ప్రభాతవార్త:

శ్రీ జ్ఞానాంభిక డిగ్రీ కళాశాలకు నేషనల్ అసిస్మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్(నాక్) ఏప్లస్‌గ్రేడ్‌ను మంజూరు చేసి నట్లు కరస్పాండెంట్ రాటకొండ గురు ప్రసాద్ తెలిపారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడతూ ఈనెల 5,6 తేదీల్లో ఢిల్లీకి చెందిన నాక్ బృందం కళాశాలలో ఫీల్డ్ అసిస్టెంట్ బృందం పర్యటించడం జరిగిందన్నారు. వారు కళాశాలలో ఉన్న ల్యాబ్, నాణ్యత ప్రమాణాలు, విద్యార్థులకు అందుతున్న మౌళిక వసతులను పరిశీలించి నివేదికలను నాక్ అధికారులకు అందించడం జరిగిందన్నారు. పరివీలించిన అధికారులు అసైన్ అసిస్టెంట్ 70శాతంపీల్డ్ అసిస్టెంట్ 30శాతం రెండు నివేదఇకలను పరిశీలించి కళాశాలకు ఏప్లస్ గుర్తింపును ఇవ్వడం జరిగిందన్నారు. నాలుగు పాయింట్లు గానూ 3.46 సీజీపీ పాయింట్లు సాధించడం సంతోషంగా ఉందన్నారు. ఇంతటి విజయానికి కారకులైన కళాశాల ప్రిన్సి పాల్ రమాదేవి, అధ్యాపకులు రాఘువేంద్ర, మౌళాలి, రమ్య, అధ్యాపక బృందం, విద్యార్థులు, తల్లి దండ్రుల కృషి ఎంతో ఉందన్నారు.

## కోడి పందాలు, జూదం నిర్వహిస్తే చర్యలు : ఎస్‌పి

కడప క్రైం, జనవరి 11, ప్రభాతవార్త:

సంక్రాంతి పండగ సందర్భంగా జూదం, కోడి పందాలు మరియు గుండాట తదితర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవని కడప జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ హెచ్చరించారు. బుధవారం జిల్లా ఎస్పీ ఒక ప్రకటన ద్వారా వివరాలు వెల్లడించారు. జూదం, కోడి పందాలు, గుండాట, అక్రమ మద్యం విక్రయాలు మద్యం సేవించడం, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠినంగా వ్యవహరించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కోడి పందాలు బదులు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సంక్రాంతి పండగను ఆనందంగా, కుటుంబ సభ్యులతో సంతోషంగా జరుపుకోవాలని ఆకాక్షించారు. ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన ఉపేక్షించేది లేదని ఆయన హెచ్చరించారు.

## సైబర్ నేరాగాళ్ళ వలలో పడవద్దు : డిఎస్‌పి

మదనపల్లెక్రైం, జనవరి 11 ప్రభాతవార్త:



సైబర్ నేరగాళ్ళ వలలో పడవద్దని ప్రజలకు మదనపల్లె డిఎస్‌పి కేశప్ప పిలుపు నిచ్చారు. బుధవారం మదనపల్లె ఒకటవ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ నేరగాళ్ళు ప్రజలకు డబ్బులు ఆశచూపి మోసానికి పాల్పడుతున్నారన్నారు. నేరగాళ్ళ ఉచ్చులో విద్యావంతులే మోసపోవడం జరుగుతుందన్నారు. ఎవరైనా సైబర్ నేరగాళ్ళ చేతిలో డబ్బులు నష్ట పోతే వెంటనే సంబంధిత పోలీస్‌స్టేషన్‌ల్లో సమాచారం ఇస్తే 24గంటల్లో వాళ్ళ డబ్బులు రికవరీ చేయడం జరుగుతుందన్నారు. మైనర్లు రోడ్డు ప్రమాదాల్లో చిక్కు కుంటే వాహన యజమానులపై కూడా కేసు నమోదు చేస్తామని హెచ్చరిం చారు. పోలీసు బృందాలు వాహనాల తనిఖీల సమయంలో ప్రతి వాహనదారుడు లైసెన్స్, ఆర్‌సి, ఇన్సూరెన్స్ వెంట పెట్టుకొని వాహనాలను నడపాలన్నారు. హెల్మెట్ ఖచ్చితంగా దరించాలన్నారు. కార్యక్రమంలో ఒకటవ పట్టణ ఇన్‌చార్జ్ సిఐ సాధిక్‌అలీ, రూరల్ సత్యనారాయణ, ఎస్ఐలు చంద్రమోహన్, హరి హర ప్రసాద్‌లు పాల్గొన్నారు.

## ఎంఆర్‌పిఎస్ నాయకులు చలో బెంగళూరు

రామసముద్రం, జనవరి 11 ప్రభాతవార్త:



ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌సి పార్టీలు అనుబంధం సంఘాలు ఆధ్వర్యంలో ఎస్‌సి వర్గీకరణ పార్లమెంటు చట్టబద్ధత కల్పించాలని బిజెపి ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని బెంగులూరులో జరిగే జాతీయ మహాసభకు మందక్రిష్ణమాదిగ ఆదేశాల మేరకు రామసముద్రం మండలం ఎఆర్‌పిఎస్ అధ్యక్షులు రాజేష్, కొండప్పల ఆధ్వర్యంలో నాయకులు కార్యకర్తలు బయలుదేరి వెళ్లారు. బయలుదేరి వెళ్ళిన వారిలో ఎంఆర్‌పిఎస్ అధ్యక్షులు రాజేష్, ఎంఎస్‌సి మండల ఇన్‌చార్జ్ కొండప్ప, ఉప అధ్యక్షులు గంగాధర్ అధ్యక్షులు విశ్వనాథ్, సుబ్బు, కార్యదర్శి సుధాకర్, ప్రచార కార్యదర్శి వాసు, ఎంవైఎఫ్ మండల అధ్యక్షులు ప్రశాంత్, గంగాధర్, వెంకటరమణ, లక్ష్మీపతి, క్రిష్ణ, మురళి, శివ, నరసింహులు, అశోక్, నరసింహులు, నాగ, రవి ఉన్నారు.

## నాటు తుఫాకి కలిగి ఉన్న వ్యక్తి అరెస్టు

మదనపల్లెక్రైం, జనవరి 11 ప్రభాతవార్త:

నాటు తుఫాకి కలిగి ఉన్న ఓ వ్యక్తిని అరెస్టు చేసి అతని నుంచి తుపాకీ స్వాధీనం చేసుకొన్నట్లు తాలూకా సిఐ సత్యనారాయణ తెలిపారు. మదనపల్లె మండలం కొత్తవారిపల్లె పంచాయితీ నాయనివారిపల్లెకు చెందిన శ్రీనివాసుల నాయుడు రైతు వద్ద నాటుతుపాకి కలిగి ఉంది. కొంతకాలంగా వన్యప్రాణులను వేటాడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో బుధవారం అతన్ని అరెస్టు చేసి తుపాకి స్వాధీనం చేసుకొన్నారు. ఈకేసులో శ్రీనివాసులను రిమాండ్‌కు తరలించారు. తుపాకిని సీజ్ చేస్తామని సిఐ పేర్కొన్నారు.

## పంట నమోదు తప్పనిసరి

జమ్మలమడుగు, జనవరి 11, ప్రభాతవార్త:



ముద్దనూరు మండలం బొందల కుంట రెవెన్యూ గ్రామంలో రబీలో సాగు చేసిన జొన్న, ఉలవ, కంది పంటలను ఈ పంట నమోదు జరిగే కార్యక్రమాన్ని మండల వ్యవసాయాధికారి మారెడ్డి వెంకట కృష్ణారెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు రబీలో సాగు చేసిన ప్రతి పంటను నమోదు చేయించుకోవాలని తెలిపారు. తద్వారా ప్రకృతి వైపరీత్యాల వల్ల జరిగే ప్రమాదాలకు ప్రభుత్వం ద్వారా రైతులకు పంటల బీమా పొందే అవకాశం ఉందన్నారు. కావునా ప్రతి రైతు తమ పంటను ఈ క్రాప్ తప్పకుండా చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైసీపీ నాయకుడు ఆకుల రవి, మరియు ఐతు సోదరులు ఆర్బఈకే సిబ్బంది ప్రశాంత్‌కుమార్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సుధీర్, రమాదేవి, నౌకరు రమణయ్య పాల్గొన్నారు.

## నాణ్యమైన విత్తనాలు విక్రయించాలి

జమ్మలమడుగు, జనవరి 11, ప్రభాతవార్త:



ముద్దనూరు మండలంలోని ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల డీలర్లతో బుధవారం మండల వ్యవసాయాధికారి మారెడ్డి వెంకట కృష్ణారెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పాస్ మిషన్ ద్వారా ఎరువులను విక్రయించాలని, నిబంధనలు పాటించకుండా అమ్మకాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కాలం చెల్లిన మందులు ఉంచ రాదని, రశీదులు తప్పకుండా కొనుగోలు చేసిన రైతులకు ఇవ్వాలన్నారు. స్టాక్ రిజిస్టరు పాటించి పక్కాగా అమలు చేయాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మాత్రమే ఎరువులు విక్రయించాలని అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఎరువులు, విత్తనాలు పురుగు మందుల డీలర్లు పాల్గొన్నారు.

## గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే

కమలాపురం, జనవరి 11, ప్రభాతవార్త:



కమలాపురంనగర పంచాయతీ 2వ గ్రామ సచివాలయ పరిధిలో 17, 14, 3, 13వ వార్డుల్లో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి యువ నాయకులు నరేన్ రామాంజులరెడ్డి పాల్గొన్నారు. ముందుగా పడమటి వీధిలోని మహబూబ్ సుబ హాని జెండా చెట్టు దర్గాలో ప్రత్యేక ఫాతెహా నిర్వహించారు. అనంతరం వారు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఆ ఇంటికి ఎంత లబ్ధి చేకూ రిందో వివరిస్తూ వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పలువురు తమ సమస్యలు గురించి ఎమ్మెల్యే దృష్టికి తేవడంతో ఆయన వవెంటనే స్పందించి అధికారులను వారి సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## 104 వైద్యసేవలకు విశేష స్పందన

కలికిరి, జనవరి 11 ప్రభాతవార్త :



మండలంలోని మర్రికుంటపల్లె పంచాయతీలో బుధవారం నిర్వహించిన 104 వైద్యసేవలకు విశేష స్పందన లభించింది. 104 వైద్యసేవల్లో భాగంగా గ్రామీణ ప్రాంత ప్రజలకు మేడికుర్తి వైద్యాధికారిణి కావ్యగంధ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా బీపి, షుగర్ పరీక్షలను రోగులను నిర్వహించారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాదపడుతూ నడవలేని స్థితిలో ఉన్న రోగులకు వైద్యాధికారిణి కావ్యగంధ వైద్యచికిత్సలు నిర్వ హించి మందులను అందజేశారు. 104సేవలకు అధికసంఖ్యలో రోగులు, గర్భవతులు హాజరు అయ్యారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఎ.రెడ్డిరామ్, హెల్త్‌సూపర్ వైజర్ సారెమ్మ, ఏఎన్ఎం కావ్యశ్రీ, ఎంఎల్‌హెచ్‌పి సాహిదా ఆశా కార్యకర్తలు ఖాదర్‌బీ, మంజుల, సుమలత, ఫైలెట్ సయ్యద్‌బాషా పాల్గొన్నారు.

## నేడు ఎమ్మెల్యే పర్యటన

కురబలకోట, జనవరి 11 ప్రభాతవార్త:

కురబలకోట మండలంలో గురువారం స్థానిక ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి పర్యటిస్తారని ఎంపిడిఓ దిలీఫ్‌కుమార్ తెలిపారు. మండలంలోని దాదంవారిపల్లె గ్రామ పంచాయితీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని నిర్వహిస్తారని ఎంపిడిఓ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## ఐకమత్యంతోనే వడ్డెరల అభివృద్ధి

కడప వైద్యవిభాగం, జనవరి 11, ప్రభాతవార్త:



వడ్డెర సంక్షేమ సంఘం నాయకులు జి.రమణయ్య, బత్తల లింగమూర్తి వడ్డెరల ఐకమత్యంతో ముందుకు వెళ్లాలని అప్పుడే సంఘం అభివృద్ధి చెందు తుందని జిల్లా అధ్యక్షులు రమణయ్య, గౌరవాధ్యక్షులు సీనియర్ నాయకులు బత్తల లింగమూర్తి అన్నారు. బుధవారం కడప నగరం పాత రిమ్స్‌లోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో స్వాతంత్ర్య సమరయోదుడు వడ్డే ఓబన్న జయంతి వేడుకలు నిర్వహించారు. నాయకులు వీరయ్య, నాగరాజు, వేణు, రామచంద్రయ్య, వెంకటరమణ, దేరంగుల సుబ్బరాయుడు, మంజుల సుబ్బరాయుడు, గోపి, పవన్ ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈర్ష్య ద్వేషాలు మాని ప్రేమగా జీవించాలన్నారు. కార్యక్రమంలో వడ్డెర సంక్షేమ సంఘం నాయకులు, యువకులు పాల్గొన్నారు.

## రైల్వేశాఖ హామీ ఇచ్చి ఏడాది పూర్తి

### పట్టించుకోని పాలక, ప్రతిపక్షాలు

కమలాపురం, జనవరి 11, ప్రభాతవార్త:

కమలాపురం పట్టణం రైల్వే స్టేషన్‌లో గత మూడు సంవత్సరాలుగా అన్ని ప్రయాణికుల రైళ్ల స్టాపింగ్ రద్దు అయిన విషయం తెలిసిందే. కరోనా లాక్ డౌన్ లో కరోనాను నిర్మూలించేందుకు కేంద్రం పలు రైళ్లను రద్దు చేసింది. అందులో భాగంగా కమలాపురం రైల్వే స్టేషన్‌లో గతంలో నడుస్తున్న రైళ్లు కరోనా తరువాత కూడా ఈ స్టేషన్‌లో నిలుపుదల చేయడం లేదు. జనవరి 10 2022న కమలలాపురంలో అధికారపోం, వైసీపీ రైలు రోకో నిర్వహించి నిన్నటికి సంవత్సరం గడిచినా ఇప్పటి వరకు కమలాపురం రైల్వేస్టేషన్‌లో వెంకటాద్రి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ మినహా ఏ రైళ్లు ఆపడం లేదు. గత సంవత్సరం ఎంపీ అవినాష్ రెడ్డి, నియోజకవర్గ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, ఆర్టీసీ ఛైర్మన్ మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో రైలు రోకో నిర్వహించి రైల్వే అధికారులకు వినతిపత్రం అందజేశారు. రైల్వే అధికారులు వీలైనంత త్వరగా ప్యాసింజర్ రైళ్లు నిలుపుదల చేస్తామని హావమీ ఇచ్చారు. అయితే ఆ హామీని రైల్వే అధికారులు నిలుపుకో లేదు. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయితే కమలాపురం రైల్వే స్టేషన్‌లో వెంకటాద్రి మాత్రమే నిలుపుదల చేస్తున్నారు.అన్ని రైళ్లను నిలుపుదల చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

## జీవో నెంబర్-1ని రద్దు చేయాలి ఆందోళన

కడప ఎడ్యుకేషన్, జనవరి 11, ప్రభాతవార్త:



భావ ప్రకటన స్వేచ్ఛను హరించే అప్రజాస్వామికమైన జీవో నెంబర్ 1ని భేషరతుగా రద్దు చేయాలని కడప నగరంలోని ఐటీఐ సర్కిల్‌లో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి అంకన్న, జిల్లా కార్యదర్శి నాగేంద్రబాబు మాట్లాడుతూ ప్రభుత్వం జారీ చేసిన ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో పోలీసుస్టేషన్‌లో యాక్ట్ 30సెక్షన్ అమలులోకి తెచ్చిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తన వైఫల్యా లను కప్పి పుచ్చుకోవడానికి జీవో నంబర్ 1ని తీసుకొచ్చిందన్నారు. తక్షణమే చీటికి జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, రచయితలు, మేధావులను మానవ హక్కుల నేతలను కలుపుకొని తీవ్ర స్థాయిలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. సమావేశంలో పీడీ ఎస్‌యూ నగర నాయకులు శ్రీనివాసులురెడ్డి, విక్కి, అశోక్, సిసింద్రీ, గణేష్ కుమార్, హేమంత్‌కుమార్, షణ్ముఖ, చెన్నయ్య పాల్గొన్నారు.

## కోడి పందాలు, జూదం నిర్వహిస్తే చర్యలు : ఎస్‌పి

కడప క్రైం, జనవరి 11, ప్రభాతవార్త:

సంక్రాంతి పండగ సందర్భంగా జూదం, కోడి పందాలు మరియు గుండాట తదితర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవని కడప జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ హెచ్చరించారు. బుధవారం జిల్లా ఎస్పీ ఒక ప్రకటన ద్వారా వివరాలు వెల్లడించారు. జూదం, కోడి పందాలు, గుండాట, అక్రమ మద్యం విక్రయాలు మద్యం సేవించడం, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠినంగా వ్యవహరించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కోడి పందాలు బదులు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సంక్రాంతి పండగను ఆనందంగా, కుటుంబ సభ్యులతో సంతోషంగా జరుపుకోవాలని ఆకాక్షించారు. ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన ఉపేక్షించేది లేదని ఆయన హెచ్చరించారు.

## 3వ రోజూ ఉత్సాహంగా క్రీడా పోటీలు

కడప క్రైం, జనవరి 11, ప్రభాతవార్త:



జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు నగరంలోని పోలీసు పరేడ్ మైదానంలో 3వ రోజు బుధవారం ఉత్సాహంగా ఆటల పోటీలు జరిగాయి. జిల్లాలోని 6 పోలీసు సబ్ డివిజన్ల నుంచి పోలీసులు పాల్గొన్నారు. హాకీ, వాలీబాల్, కబడ్డీ, ఫుట్‌బాల్, బాస్కెట్ బాల్, మహిళలకు కబడ్డీ, ఖోఖో, అథ్లె టిక్స్, విభాగంలో పరుగు పోటీలతో పాటు హైజంప్, లాంగ్‌జంప్, షాట్‌పుట్, డిస్కస్ త్రో, జావెలిన్‌త్రో విభాగాల్లో పోటీలు జరిగాయి. జిల్లా స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌ను ఏఆర్ అదనపు ఎస్పీ కృష్ణారావు, ఏఆర్ డీఎస్పీ రమణయ్యలు పర్యవేక్షించారు.

## ఉపాధి కూలి రూ.600 ఇవ్వాలి

కమలాపురం, జనవరి 11, ప్రభాతవార్త:



కేంద్ర ప్రభుత్వం కొత్త నిబంధనలు పేరుతో ఉపాధి కూలీల నోట్లో మట్టి కొట్టొద్దని ఉపాధి హామీ పథకం కింద పని చేసే కూలీలకు పని రోజులు పెంచాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు పగడపూల మల్లి కార్జున ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఉపాధి కూలీల సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఏపీవో శైలజకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏపీలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనులు చేస్తున్న ఉపాధి కూలీలకు వంద రోజుల పని దినాలు కల్పించి కనీసం రోజుకూలీ రూ.600 ఇవ్వాలన్నారు. కూలీలు పని చేసే ప్రదేశంలో ప్రమాద వశాత్తు మరణిస్తే వారికి రూ.10లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. కూలీలకు పరికరాలు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఏరియా సహాయ కార్యదర్శి నాగేశ్వరరావు, నాయకులు రాయప్ప, సుబ్బరాయుడు, గంగాధర్, గంగయ్య, కదిరయ్య, నారాయణలు పాల్గొన్నారు.

## బావాజీని అభినందించిన మంత్రి పెద్దిరెడ్డి

కలికిరి, జనవరి 11 ప్రభాతవార్త:



కలికిరి మండల ఎంపిపి వేంపల్లి నూర్జాహన్ తనయుడు కలికిరి మండల వైసిపి యువనాయుడు అయిన వేంపల్లి బావాజీని మంత్రి పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డి అభినందించి దుశ్శావలతో సన్మానించారు. బుధవారం బావాజీ మంత్రిని కలవడం జరిగింది. ఈసందర్భంగా కలికిరి మండలంలో మంగళవారం జరిగిన ఎంపి మిథున్‌రెడ్డి పర్యటనలో బావాజీ తన అనచురులతో ద్విచక్ర వాహనాలతో బారీ ర్యాలీనిర్వహించి ఎంపి, ఎమ్మెల్యేలకు స్వాగతం పలకడంలోనూ, పంచాయతీలోని మసీదుల అభివృద్ధికి ఎంపి నిధుల ద్వారా రూ.43 లక్షలు మంజూరు చేయించుకోవడం, మండల అభివృద్ధికి ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపడంలో చురుకైన పాత్ర వహించడంతో అతనిని మంత్రి అభినందించారు. ఇదే స్పూర్తితో కలికిరి మండలంలో అందరిని కలుపుకొని వెళ్ళి జరగబోయే ఎన్నికల్లో వైసిపి పార్టీని గెలిపించాలని మంత్రి పెద్దిరెడ్డి బావాజీకి తెలపడం జరిగింది. కార్యక్రమంలో జిల్లా వైసిపి విద్యార్థి విభాగం నాయకులు నరేష్ పాల్గొన్నారు.

## త్యాగబ్రహ్మ చిత్రపటంతో ఊరేగింపు

కడప ఏడురోడ్లు, జనవరి 11, ప్రభాతవార్త:



భారత సంగీత సాంప్రదాయ నిధి శ్రీ త్యాగరాజ స్వామి అని కడప జిల్లా నాయీ బ్రాహ్మణ వాయిద్య కళాకారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎగువ గడ్డ రంగయ్య కొనియాడారు. త్యాగరాజ ఆరాధనోత్సవాలు పురస్కరించుకొని బుధవారం త్యాగయ్యకు నివాళులు అర్పిస్తూ చిన్నచౌకు నాయీ బ్రాహ్మణుల ఆధ్వర్యంలో వాహనంపై త్యాగయ్య చిత్రపటాన్ని ఊరేగించారు. మేళ తాళాలతో త్యాగయ్య సంకీర్తనలు ఆలపిస్తూ అశోక్‌నగర్ పురవీధుల్లో ఈ ఊరేగింపు కొనసాగింది. ఆయన మాట్లాడుతూ 1767వ సంవత్సరం మే 4వ తేదీన కాకర్ల రామబ్రహ్మం, సీతమ్మ దంపతులకు తంజావూర్ జిల్లా తిరువ య్యూర్‌లో జన్మించారన్నారు. త్యాగరాజ ఆరాధన ఉత్సవాలు ఏపీ, తమిళనాడుతో పాటు పలు ప్రాంతాల్లో అత్యంత వైభవంగా జరుగుతాయన్నారు. త్యాగయ్య రచించిన పంచరత్నాలు, శ్రీరామునిపై ఆయన రాసిన కీర్తనలు విశేష ప్రజాదరణ పొందాయని వివరించారు. కార్యక్రమంలో చిన్నచౌకు చెందిన పలువురు నాయీ బ్రాహ్మణ వాయిద్య కళాకారులు పాల్గొని త్యాగరాజ స్వామి కి ఘన నివాళులు అర్పించారు.

## పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజుకు సన్మానం

కడప ఏడురోడ్లు, జనవరి 11, ప్రభాతవార్త:



పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టాక తొలిసారిగా కడపకు వచ్చిన గిడుగు రుద్రరాజును వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతం, రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ ఆరీఫుల్లా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా గిడుగు రుద్రరాజు మాట్లాడుతూ సీనియర్ కాంగ్రెస్ మాజీ జిల్లా అధ్యక్షులు నజీర్ అహ్మద్ సహకారంతో మైనార్టీలలో కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలని షేక్ ఆరీఫుల్లాను కోరారు. ఆరీఫుల్లా మాట్లాడుతూ నజీర్ అహ్మద్ అండదండలతో జిల్లాలో నా శాయశక్తులా కృషి చేస్తూ పార్టీని బలోపేతం చేస్తానన్నారు.

## ఎమ్మెస్ రాజు అరెస్టు అన్యాయం : టిడిపి

కడప వైద్యవిభాగం, జనవరి 11, ప్రభాతవార్త:



ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎమ్మెస్ రాజును పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడం అన్యాయమని దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెదేపా నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం కడప తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర టీడీపీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి గడ్డ గుర్రప్ప, తెదేపా రాష్ట్ర ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి గొడుగునూరు రాజశేఖర్ మరియు టీడీపీ ఎస్సీ నాయకులు మాట్లాడుతూ కావలిలో దళితులపై జరుగుతున్న వరుస దాడులకు నిరసనగా చలో కావలి కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకొని రాజును అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. టీఎన్ ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాసాపేట శివ, కమలాపురం నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు పుల్లగూర శ్రీనివాసులు మాట్లాడుతూ దళితులకు జరుగుతున్న అన్యాయాన్ని, దళితులపై దాడులను బాధిత దళిత కుటుంబాలను ప్రజా క్షేత్రంలో ప్రశ్నించ డానికి వెళ్తున్న మా ఎస్సీ నాయకులను అడ్డుకోవడం ప్రజా స్వామ్య విరుద్ధ మన్నారు. బాధ్యులైన పోలీసులు తగిన మూల్యం చెల్లించుకుంటా రన్నారు. కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ కడప పార్లమెంటు మీడియా కోఆర్డినేటర్ విశ్వనాథ్ పాల్గొన్నారు.

## వడ్డెర సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా బండారు వెంకటరమణ

కడప వైద్యవిభాగం, జనవరి 11, ప్రభాతవార్త:



వడ్డెర సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా వెంకటరమణ నియమితు లయ్యారు. బుధవారం స్థానిక బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో వడ్డెర సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు జి.రమణయ్య, గౌరవాధ్యక్షులు సీనియర్ నాయకులు బత్తల లింగమూర్తి ఆయన్ను నియమించారు. ఈ మేరకు బండారు వెంకటరమణ తన నియామకానికి సహకరించిన వడ్డెర సంక్షేమ సంఘం నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. తమపై నమ్మకం ఉంచి ఉపాధ్యక్షులుగా నియ మించినందుకు బాధ్యతగా తమ వంతు కృషి చేసి సంఘం అభివృద్ధికి తోడ్పడతానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో దేరంగుల సుబ్బరాయుడు, మంజుల సుబ్బరాయుడు పాల్గొన్నారు.

## వడ్డే ఓబన్న జయంతి సందర్భంగా అన్నదానం

కడప వైద్యవిభాగం, జనవరి 11, ప్రభాతవార్త:



స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతి సందర్భంగా వడ్డెర సంక్షేమ సంఘం నాయకుల ఆధ్వర్యంలో స్థానిక అంధుల పాఠశాలలో బుధవారం మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. పాఠశాలలో చదువుతున్న పేద విద్యా ర్థులు 50 మందికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో వడ్డెర సంఘం నాయకులు, యువకులు పాల్గొన్నారు.

## సీఎం ఆశీస్సులతో అభివృద్ధి పనులు వేగవంతం : ఎమ్మెల్యే

ప్రొద్దుటూరు జనవరి 11, ప్రభాతవార్త



ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆశీస్సులతో ప్రొద్దుటూరులో అభివృద్ధి పనులను వేగవంతం చేస్తూ ఫిబ్రవరి మొదటి వారంలో 5 ప్రధాన కాలువల ఆధునీకరణ త్రాగునీటి నూతన పైప్ లైన్ ఏర్పాటు పనులను ప్రారంభిస్తున్నట్లు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పబ్లిక్ హెల్త్ అధికారులు, కాంట్రాక్టర్లతో సమీక్ష నిర్వహించిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ ప్రొద్దుటూరు అభివృద్ధి పనులపై సీఎం ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారని పేర్కొన్నారు ఇటీవల కలిసిన ప్రతిసారి అభివృద్ధి పనులపై సీఎం ఆరా తీయడం పై ఆయన సంతోషాన్ని వ్యక్తం చేశారు. ప్రధానంగా 70 కిలోమీటర్ల మేర వీధిలోని మురుగునీటి కాలువలు ఆధునికరణ 5.26 కిలోమీటర్ల మేర ప్రధాన కాలువల ఆధునీకరణ పనులు చేయవలసి ఉందన్నారు. ఈ మురుగునీటిని శుద్ధి చేసేందుకు ఐదు ఎకరాల భూమిని కొనుగోలు చేసి శుద్ధి చేసే కర్మాగారం ఏర్పాటు చేస్తారన్నారు సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్ లక్ష్మీదేవి నాగరాజు వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి వైసిపి సీనియర్ నాయకులు కాకర్ల నాగశేషారెడ్డి కౌన్సిలర్లు భూమిరెడ్డి వంశీధర్ రెడ్డి పిట్టా బాలాజీ ఇర్ఫాన్ భాష వైసీపీ పట్టణ అధ్యక్షులు కామిశెట్టి బాబు బండారు సూర్యనారాయణ పాలగిరి ఖాజా రాయపరెడ్డి పాల్గొన్నారు.

## ఇద్దరు కౌన్సిలర్లను వైసిపి నుండి సస్పెన్షన్

కడప, జనవరి 11, ప్రభాతవార్త:



ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలోని ఐదో వార్డ్ కౌన్సిలర్ వంగనూరు మురళీధర్ రెడ్డి, 22 వ వార్డు ఇండిపెండెంట్ కౌన్సిలర్ మహమ్మద్ గౌస్ ను వైసీపీ నుండి సస్పెండ్ చేస్తున్నట్లు అన్నమయ్య జిల్లా అధ్యక్షులు ఆకేపాటి అమరనాధరెడ్డి తెలిపారు. గత కొంతకాలంగా ప్రొద్దుటూరులో 5 వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ వంగనూరు మురళీధర్ రెడ్డి కౌన్సిలర్ అయినప్పటి నుండి పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనడం లేదని, వార్డులో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొనకుండా పార్టీ వ్యతిరేక కార్యక్రమాలు చేపడుతూ బ్లాక్మెయిల్ రాజకీయాలు, వ్యాపారస్తుల నుండి బ్లాక్మెయిల్ వసూళ్లకు పాల్పడుతూ స్థానిక ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి కి వ్యతిరేకంగా పనిచేస్తున్నందుకు వేటు వేస్తున్నామని జెడ్పీ చైర్మన్ అమర్నాథ్ రెడ్డి పత్రిక ప్రకటనలో బుధవారం తెలియజేశారు. అంతేకాకుండా ఇటువంటి కార్యక్రమాలు ఎవరు చేపట్టిన, ఎంత వారైనా ఉపేక్షించేది లేదని వేటు తప్పదని ఆయన హెచ్చరికలు జారీ చేశారు.

## విక్రయాలకు సంబంధించి బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలి

**పులివెందుల రూరల్, జనవరి 11, ప్రభాతవార్త :**

రైతులకు విక్రయించే క్రిమిసంహారక మందులు, విత్తనాలు, ఇతరత్రా విక్రయాలకు సంబంధించి బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలని మండల వ్యవసాయాధికారిణి నాగలక్ష్మి అన్నారు. పులివెందుల పట్టణంలోని పలు ఎరువులు దుకాణాలను బుధవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎరువులకు సంబంధించిన స్టాక్ రిజిష్టర్‌ను తప్పనిసరిగా మెయింటెన్ చేయాలన్నారు. ధరలను సూచించే పట్టికను తప్పకుండా ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బికె ఇన్‌ఛార్జిలు, వ్యవసాయ, ఉద్యాన సిబ్బంది, ఎరువుల దుకాణదారులు పాల్గొన్నారు.

## భూ కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలి

**వేంపల్లె, జనవరి 11, ప్రభాతవార్త :**



వేంపల్లె మండలంలో జరిగే భూ కబ్జాదారులపై రెవెన్యూ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని టీడీపీ మండల కన్వీనరు రామమునిరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం వేంపల్లెలోని టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. వైకాపా నాయకులు కొండలను పిండి చేస్తూ మట్టిని అక్రమంగా తవ్వకాలు చేస్తున్నారని విమర్శించారు. వైకాపా అగ్ర నాయకులు విశాఖలోని రిషి కొండలను తవ్వకాలు చేస్తోంటే ఇక్కడ ద్వితీయ శ్రేణి నాయకులు వేంపల్లెలోని కొండలను తవ్వేస్తున్నారని చెప్పారు. వైకాపా పాలనల భూ ఆక్రమణాలు ఎక్కువగా జరుగుతున్నట్లు చెప్పారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆక్రమణాలపై విచారణ చేసి ప్రభుత్వం స్వాధీనం చేసుకునే విధంగా చర్యలు చేపడతామన్నారు. అవినీతి చేసిన అధికారులపై కూడా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రభుత్వ భూములను సొంత భూముల్లాగా లేఔట్లు వేసి విక్రయాలు చేస్తున్నారని, దీనివల్ల అమాయక ప్రజలు మోసపోతున్నట్లు చెప్పారు. ఈ విలేకర్ల సమావేశంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి మహమ్మద్, ఇనయతుల్లా, టీడీపీ యూనిట్ సభ్యుడు మారుతి పాల్గొన్నారు.

## ఉషాకిరణ్ ఉన్నత పాఠశాలలో ముగ్గుల పోటీలు

**వేంపల్లె, జనవరి 11, ప్రభాతవార్త :**



వేంపల్లె పట్టణంలోని ఉషాకిరణ్ ఉన్నత పాఠశాలలో బుధవారం ముందస్తు సంక్రాంతి సంబరాల్లో భాగంగా 6 నుండి 10వ తరగతి విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ఎంఈవో ముఖ్య అతిథిగా హాజరై బహుమతులు ప్రదానం చేశారు. ముగ్గుల పోటీలు నిర్వహించి విద్యార్థులను ప్రోత్సహించిన కస్పాండెంట్ బిఎస్ రమణారెడ్డిని ఆయన అభినందించారు.

## 4.20లక్షల రూపాయల ముఖ్యమంత్రి సహాయనిధి అందజేత

**రామాపురం.జనవరి11 ప్రభాతవార్త**



వరంలా ముఖ్యమంత్రి సహాయనిధి ఉపయోగపడుతోందని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డిలు అన్నారు. సిఎం సహాయనిధి నుంచి మంజూరైన రెండు చెక్కులను బుధవారం రామాపురం మండలం సుద్దమళ్ల గ్రామం యర్రమరెడ్డిగారిపల్లిలో లబ్దిదారులకు వారు అందజేశారు. మండలంలోని కల్పనాయని చెరువుకు చెందిన చింతాకుల సావిత్రమ్మకు 2.70 లక్షలు, నీలకంఠరావుపేటకు చెందిన మండెం రెడ్డిహేమంత్‌కు 1.50లక్షలు విలువ చేసే చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లి మార్కెట్ కమిటి చైర్మన్ విశ్వనాథరెడ్డి, మండల ఉపాధ్యక్షులు రవిశంకర్‌రెడ్డి, సర్పంచ్‌లు ఆయూబ్, వెంకట్రామిరెడ్డి, ఉప సర్పంచ్ వెంకటసుబ్బారెడ్డి, శ్రీను, రషీద్, సహదేవరెడ్డి, ఖతీబ్, జాఫర్, కృష్ణయ్య, జనార్ధన్‌రెడ్డి, రెడ్డెయ్య, సుబ్బారెడ్డి, విజయభాస్కర్, జనార్దన్, శివశంకర్, చలపతి, శివ, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## గెలుపు ఓటములు సమానమే

**రామాపురం.జనవరి11 ప్రభాతవార్త**



క్రీడల్లో గెలుపోటములు సమానమేనని మాజీ ఎమ్మెల్యే మోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని సరస్వతి పల్లి గ్రామంలో బుధవారం లక్కిరెడ్డిపల్లి మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి ఆ గ్రామ సర్పంచ్ మునీర్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ ఏర్పాటు చేశారు. ఈ టోర్నమెంట్‌కు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించారు. ఆయనకు కమిటి సభ్యులు వైఎస్సార్‌సిపి నాయకులు గ్రామ ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువకులు మీకు స్పోర్ట్స్‌లో సరైన నైపుణ్యం నిర్ణయం తీసుకోవడం మరియు జీవితంలో నిజమైన ఎంపికలు ఉంటేనే మీరు భవిష్యత్తును మార్చగలరు. దీర్ఘకాలంలో మీరు క్రీడలు, అథ్లెటిక్స్‌లో చురుకుగా, నిరంతరాయంగా పాల్గొనడం వల్ల ఫిట్‌నెస్, శ్రేయస్సు సంతోషంపరంగా మీక గొప్ప పేరు ప్రతిష్టలు లభిస్తాయి అని అన్నారు. ఈ కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లి మార్కెట్ చైర్మన్ కర్ణపు విశ్వనాథరెడ్డి, జడ్పిటిసి మాసన వెంకటరమణ, వైఎస్సార్‌సిపి రాష్ట్ర యువజన విభాగ జనరల్ సెక్రటరీ సూరం వెంకటసుబ్బారెడ్డి, సర్పంచ్ మునీర్ బాష, మహబూబ్‌బాష, వైస్ ఎంపిపి బాబు, రమణ, కదిరప్పనాయుడు, దువూరి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## సచివాలయాలను ఆకస్మిక తనిఖీ చేసిన ఎంపిడివో హైదర్‌వలి

**రామాపురం.జనవరి11 ప్రభాతవార్త**



మండలంలోని రామాపురం పరిధిలో ఉన్న హౌసింగ్ కాలనీ గువ్వలచెరువు గోపగుడిపల్లి కల్పనాయుని చెరువు, నీలకంఠరావుపేట గ్రామాల్లోని సచివాలయం బుధవారం ఎంపిడివో హైదర్‌వలి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలని ప్రజల నుంచి వచ్చే పిర్యాదులను స్వీకరించి వారికి సమాధానాలు ఇవ్వాలన్నారు. అలాగే హౌసింగ్ సిబ్బంది హౌసింగ్ లబ్దిదారులకు బిల్లులు పెండింగ్ పెట్టకుండా వెంటనే బిల్లులు చెల్లించాలని ఆయన అన్నారు. హౌసింగ్ లబ్దిదారులకు సహకరించని సిబ్బందిపై చర్యల తీసుకుంటామన్నారు. సచివాలయంలో ప్రతిరోజు సాయంత్రం 3గంటల నుంచి సాయంత్రం 5వరకు స్పందన కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. ఈ స్పందన కార్యక్రమంలో సిబ్బంది అన్ని శాఖల వారు ఉండాలన్నారు. ఒకవేళ సిబ్బంది ఎవరు లేకపోయినా అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు నాగమణి, హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## భవిత కేంద్రంలో ముందస్తు సంక్రాంతి సంబరాలు

**వేంపల్లె, జనవరి 11, ప్రభాతవార్త :**



వేంపల్లెలోని భవిత కేంద్రంలో బుధవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఇందులో భాగంగా దివ్యాంగ చిన్నారులు, వారి తల్లిదండ్రుల సమక్షంలో భోగిపండ్లు వేశారు. పండుగలలో ప్రత్యేకమైన పండుగ సంక్రాంతి అన్నారు. భవిత కేంద్రంలో దివ్యాంగుల కోసం భోగిపండ్ల కార్యక్రమం వారి తల్లిదండ్రుల ఆధ్వర్యంలో నిర్వహించడం చాలా సంతోషం అని ఐఈఆర్టీ యశోధ తెలిపారు. కార్యక్రమంలో సీఆర్పీ ప్రకాష్‌రెడ్డి, సూర్యకుమారి, నాగరాణి, కల్యాణి, ఎంఐఎస్ అబ్దుల్, సుజాత, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మీ భద్రత...మీ విలువైన సంపద...సంరక్షణ

**-అర్బన్ సిఐ సుధాకర్‌రెడ్డి**

**రాయచోటి.జనవరి11 ప్రభాతవార్త**



రాయచోటి ప్రజల భద్రత, సంరక్షణే లక్ష్యంగా పట్టణంలో అనునిత్యం ప్రహారాకాస్తూ పట్టణంలో నేరాలు, అసాంఘిక కార్యకలాపాలు కట్టడిచేయడంలో మన పోలీస్ పాత్ర ఎంతో ఉందని అర్బన్‌సిఐ సుధాకర్‌రెడ్డి అన్నారు. బుదవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నేడు మారుతున్న పరిస్థితులు, ఆధునిక టెక్నాలజీని ఆసరా చేసుకుని పలు చోట్ల నేరస్తులు తమ అసాంఘీక కార్యకలాపాలను కొనసాగిస్తున్నారన్నారు. వీటిని అడ్డుకట్ట వేసేందుకు ప్రజలు సైతం తమ వంతు భాద్యతగా ప్రస్తుత నేరాలను కట్టడి చేయడంలో పోలీస్‌లు సహకరించాలన్నారు. రాయచోటి టౌన్, పరిసర ప్రాంతాలలో ఇటీవల కాలంలో తాళం వేసిన ఇళ్లు, షాపులను లక్ష్య ంగా చేసుకుని నేరస్థులు దొంగతనాలకు పాల్పడుతున్నారన్నారు. దయచేసి మీ ఇళ్లు, షాపులలో వీలైనంత వరకు సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, అలా వీలులేని పక్షంలో మీకు సంబందించి విలువైన వస్తువులు అనగా బంగారు, డబ్బులు వంటివి మీ వెంట తీసుకెళ్లడంకాని, లేదా సదరు పోలీస్ స్టేషన్‌లో లేక మీ సంబందిత సచివాలయంలో గల మహిళా పోలీస్‌లకు సమాచారం తెలియజేయండి, తద్వారా ఎలాంటి దొంగతనాలు జరగకుండా అరికట్టేందుకు అవకాశం ఉందని తెలిపారు. అలాగే మీ వాహనాలకు ఇంటి బయట పార్కింగ్ చేసే సమయంలో పటిష్టమైన లాక్ సిష్టంను వాడవలెను. రాయచోటి ప్రజలందరూ సహకరించి దొంగతనాలు నివారించడంలో పోలీస్ వారికి సహకరించాలని సుధాకర్‌రెడ్డి కోరారు.

## సంబేపల్లి హైస్కూల్‌లో ఘనంగా ముందస్తు సంబరాలు

**సంబేపల్లి.జనవరి11 ప్రభాతవార్త**



సంబేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం నాడు ప్రధానోపాధ్యాయులు మడితాటి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ సంబరాలుకు ముఖ్య అతిథిగా సంబేపల్లి తహశీల్దార్ మహేశ్వరి బాయ్ సంక్రాంతి సంబరాలలో పాల్గొన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులు భోగి మంటలు వేసి సందడి చేశారు. పాఠశాలలో విద్యార్థినిలు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో ప్రతిభ చూపిన వారిక ప్రథమ బహుమతిగా 2వేలు, ద్వితియ బహుమతిగా 1500, తృతియ బహుమతిగా 1000 రూపాయలు నగదు బహుమతులు అందజేశారు. ఈ నగదు బహుమతులను మండల వైసిపి నాయకులు ప్రతాప్‌రెడ్డి, వాసుదేవరెడ్డి, సర్పంచ్ అంచల రామచంద్ర, ఉమామహేశ్వర్ ప్రకటించి అదజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**బొగ్గులవారిపల్లిలో...**



మండల పరిధిలోని బొగ్గుల వారిపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయు లు తిరుపాల్ నాయక్, రామాంజనేయులు ఆధ్వర్యంలో బుదవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సంక్రాంతి సంబరాలకు ముఖ్యఅతిధిగా సర్పంచ్ అంచుల రామచంద్ర పాల్గొన్నారు.విద్యార్థులు రంగువల్లులు వేసి భోగి మంటలు వేసి సందడి చేశారు.

## ప్రజా సంక్షేమానికి పాటుపడేది తెలుగుదేశం పార్టీ

**-మాజీ ఎమ్మెల్యే రమేష్‌కుమార్‌రెడ్డి**

**రాయచోటి.జనవరి11 ప్రభాతవార్త**



రాష్ట్రంలో ప్రజా సంక్షేమానికి పాటుపడేది తెలుగుదేశం పార్టీ అని రాయచోటి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ మాజీ ఎమ్మెల్యే రమేష్‌కుమార్‌రెడ్డి చెప్పారు. రాయచోటి మండలం మాధవరం పంచాయతీలో బుదవారం తెలుగుదేశం పార్టీ ఆద్వర్యంలో రాష్ట్రానికి ఇదేమి కర్మ కార్యక్రమంలో బాగంగా ఆయన ప్రజలును ఉద్దేశించి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసి మైనార్టీ వర్గాల అభ్యున్నతికి టీడీపి అహర్నిషలు కృషి చేస్తుందన్నారు. కులాలకతీతంగా అందర్నీ సమదృష్టితో అనేక స ంక్షేమ పథకాలతో ప్రజల సంక్షేమం చూసిన పార్టీ తెదేపా అన్నారు. మూడన్నర సంవత్సర కాలంలో అభివృద్ది పూర్తిగా కుంటుపడిందన్నారు. రోడ్లు డ్రైనేజీలు కాలువలు, కరెంటు విద్యా వైద్యం సక్రమంగా లేవన్నారు. కార్య క్రమంలో తెలుగుదేశం నాయకులు వెంకటసుబ్బారెడ్డి, ఎంవి రమణారెడ్డి, గోరివింజకుంట శివప్రసాద్‌నాయుడు, సైకం రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

## 731800 రూపాయల మద్యం ద్వంసం

**రాయచోటి.జనవరి11 ప్రభాతవార్త**



అన్నమయ్య జిల్లా పరిధిలో వివిధ పోలీస్ స్టేషన్‌ల పరిధిలో అక్రమంగా దొరికిన మద్యం నాటు సారాను బుధవారం రాయచోటి పట్టణం బైపాస్ రోడ్డు సమీపంలో దాదాపు 7లక్షల 31వేల 830 రూపాయల మద్యం, నాటుసారాను అన్నమయ్య జిల్లా అడిషనల్ ఎస్పీ రాజ్‌కమల్ ఆధ్వర్యంలో ద్వంసం చేశారు. 86 కేసుల్లో ఇవి దొరికినట్లు ఆయన తెలిపారు.

## శానిటేషన్ సిబ్బందికి బట్టల పంపిణీ

**కార్పరేటర్ వెల్లాల హేమలత**

**కడప, జనవరి 12 ప్రభాతవార్త :**



44వ డివిజన్ కాగితాల పెంట సచివాలయ పరిధిలోని శానిటేషన్ సిబ్బందికి కార్పొరేటర్ వెల్లాల హేమలత, వైసిపి డివిజన్ ఇంచార్జ్, న్యాయవాది వెల్లాల రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా సచివాలయ సిబ్బందికి బట్టల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డివిజన్లో కార్మికుల సేవలు ఎనలేని వని కొనియాడారు. డివిజన్ ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ వైసిపి నాయకులు జేజేరెడ్డి, పుత్తా వెంకట సుబ్బారెడ్డి కార్పొరేటర్లు బాలస్వామి రెడ్డి, చల్లా రాజశేఖర్ మున్నా, అధికారులు పారిశుధ్య కార్మికులు సిబ్బంది పాల్గొన్నారు.

## తెల్లదొరలకు చుక్కలు చూపించిన వడ్డెర ఓబన్న

**రామిరెడ్డి ధ్వజారెడ్డి**

**రైల్వేకోడూరు రూరల్, జనవరి 11 ప్రభాతవార్త**



స్వాతంత్ర్య సమరయోధుల్లో బ్రిటీషువారికి చుక్కలు చూపించడంలో వడ్డెర ఓబన్న వీరాధి వీరుడని రైల్వేకోడూరు వైసిపి నాయకులు, మండల ఉపాధ్యక్షులు రామిరెడ్డి ధ్వజారెడ్డి అన్నారు. బుధవారం చిట్వేలి బైపాస్‌రోడ్డు సమీపంలో వడ్డెర ఓబన్న 216వ జయంతి ఉత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రైల్వేకోడూరు బిసి విజిలెన్స్ ఎన్‌ఫోర్స్ మానటరింగ్ సభ్యులు బత్తల సుబ్రమణ్యం, బత్తల విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజారెడ్డి పాల్గొని వడ్డెర ఓబన్న చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించి భారీకేక్ కట్‌చేసి వడ్డెర సంఘం సోదరులకు కేక్‌ను పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వేకోడూరు ప్రధాన రహదారి వద్ద వడ్డెర ఓబన్న కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు సంబంధిత అధికారులతో చర్చించి న్యాయం చేస్తామన్నారు. అనంతరం ఈ కార్యక్రమంలో యామల సిద్దేశ్వర, సి.జయకర్, ఉర్లగట్టుపోడు సర్పంచ్ గోపి, లక్ష్మయ్య, కృష్ణయ్య, వలిపి మల్లికార్జున, మల్లిబోయిన క్రిష్ణ, భాగ్యలక్ష్మీ, ఒర్సు వెంకటేశ్‌తో పాటు రైల్వేకోడూరు మండలానికి చెందిన సూరపురాజుపల్లె సర్పంచ్ దొమ్మరాజు సుబ్రమణ్యంరాజు, గంగరాజుపోడు సర్పంచ్ రామక్రిష్ణ, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీసాయి వికాస్ నందు ముందస్తు సంక్రాంతి సంబరాలు

**చిట్వేలి, జనవరి 11 ప్రభాతవార్త**



చిట్వేలి మండల పరిధిలోని శ్రీసాయి వికాస్ పాఠశాలలో కరస్పాండెంట్ తిరుమల రెడ్డయ్యనాయుడు ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి సంబరాలను పాఠశాల సిబ్బంది పిల్లలతో కలిసి బుధవారం ఘనంగా నిర్వహించారు. పంట ఇంటికి చేరే సమయంలో సంపదను, ఆనందాన్ని కుటుంబంతోను, బంధుమిత్రులతోను, సమాజంతోను పంచుకొని సంతోషంగా జరుపుకునే వేడుకలు ఎంతో ఆనందాన్ని ఇస్తాయని అన్నారు. ఉత్తరాయణ పుణ్యకాలంలో పితృదేవతలను స్మరించుకోవడం, ఫలాన్ని అందించడమే తప్ప ప్రతిఫలాన్ని ఆశించక మానవ జీవితంలో మమేకమైన మూగజీవులను పూజించడం సంక్రాంతి పండుగ ముఖ్య ఘట్టాలని కరస్పాండెంట్ రెడ్డయ్యనాయుడు పిల్లలకు తెలియపరిచారు. విద్యార్థినులకు ముగ్గులపోటీలు, గొబ్బెమ్మల కోలాహలం, హరిదాసుల వేషధారణ నడుమ ఘనంగా ముందస్తు సంక్రాంతి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు సాజి భాస్కర్, ఇన్‌ఛార్జులు వాని, వరలక్ష్మీ, శ్రీనివాసులు, చంద్రమోహన్‌రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులు అన్ని రంగాలలో రాణించాలి

**- ఏవిఆర్ పాఠశాల ప్రిన్సిపాల్ రంతుల్లా**

**బద్వేలు అర్బన్, జనవరి 11 ప్రభాతవార్త :**



విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాలలో ముందుకు రాణించాలని, అప్పుడే అనుకున్న లక్ష్యాలను నెరవే ర్చుకోగలరని ఏవిఆర్ పాఠశా ల ప్రిన్సిపాల్ రంతుల్లా అన్నారు. బుధవారం ఏవిఆర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని పలువురు ఉపాధ్యాయులు సాంప్రదాయ దుస్తులు ధరించి పాఠశాల ప్రాంగణంలో బోగి మంటలు, రంగవల్లులతో పాటు వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. పలువురు విద్యార్థులు పాఠశాల ప్రాంగణంలో రకరకాల రంగవ ల్లులను తీర్చిదిద్దారు. రంగవల్లుల పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యా ర్థు లకు ప్రిన్సిపాల్ రంతుల్లా చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. అనం తరం ప్రిన్సిపాల్ రంతుల్లా మాట్లాడుతూ విద్యార్థులు చిన్న వయసు నుండే బావితరాలకు గుర్తుండేలా సంక్రాంతి పండుగ విశిష్టత తెలుసుకోవాల్సిన అవ సరం ఎంతైనా ఉందని, అనంతరం పలు రకాలుగా సంక్రాంతి పండుగ గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యా యులు, విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## నందలూరులో పారిశుద్ధ్యం పనులు

**నందలూరు, జనవరి 11 ప్రభాతవార్త**



నందలూరు మండలంలోని నాగిరెడ్డిపల్లె పంచాయతిలోని జాతీయ రహదారిపై ఉన్న చెత్త చెదారాలను పంచాయతి అధికారి ప్రసాద్ జెసిబిల ద్వారా పరిశుభ్రం చేయించారు. ఈ మధ్య కాలంలో వచ్చిన వార్త కథనాలకు స్పందించిన ఆయన పరిసర ప్రాంతాల్లో ఉన్న దుకాణదారులు వేసిన చెత్తను తొలగించి హైవేలో ప్రయాణికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఉండేందుకే ఈ కార్యక్రమాన్ని చేపట్టామని అన్నారు. ఇక్కడ చెత్తవేదయం ద్వారా ఆవులు, పందులు వంటి రోడ్డుపైకి వచ్చి ప్రయాణికులకు ఇబ్బందులు కలిగిసు ్తన్నాయని, ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టామని ఆయన అన్నారు. పనులు జరుగుతున్న ప్రదేశాన్ని మండల ఎంపిపి మేడా విజయభాస్కర్‌రెడ్డి వచ్చి పరిశీలించి వెళ్లారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు మండల వైసిపి నాయకులు, రాష్ట్ర ముదిరాజ్ డైరెక్టర్ లక్ష్మీనరసయ్య, మండల కోఆప్షన్ సభ్యులు కలిముల్లాఖాన్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు అన్ని రంగాలలో రాణించాలి

**సరస్వతీ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ముగ్గుల పోటీలు**

**బద్వేలు అర్బన్, జనవరి 11 ప్రభాతవార్త :**



పట్టణంలోని నెల్లూరు రోడ్‌లో గల శ్రీ సరస్వతి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ నందు బుధవారం పాఠశాల ప్రిన్సిపాల్ కాకా సుబ్రమణ్యం యాదవ్ ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి పండుగను దృష్టిలో పెట్టుకొని పాఠశాల విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముగ్గుల పోటీలలో ఆంజనేయ నగర్ మహిళలు, పాఠశాల ఉపాధ్యాయులు మరియు విద్యార్థినీ, విద్యార్థులు వివిధ రకాల రంగవల్లులను పలువురిని ఆకట్టుకునేలా తీర్చిదిద్దారు. పలువురు వేసిన రంగవల్లులను న్యాయ నిర్ణేతలు, 9వ వార్డు సచివాలయ అడ్మిన్ సెక్రటరి మస్తానమ్మ, ఎస్‌బివిఆర్ డిగ్రీ కళాశాల స్టాట్స్ అధ్యాపకురాలు జి.శ్రీవాణిలు సుమారు గంట సమయం పాటు ముగ్గులను పరిశీలించి, విజేతలను ప్రకటించడం జరిగింది. మొదటి బహుమతి లావణ్య, వసుంధర, రెండవ బహుమతి రెడ్డి కీర్తన అండ్ దీక్షిత, మూడవ బహుమతి పి.పావని, లక్ష్మీ ప్రసన్నతో పాటు పోటీలలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రత్యేక బహుమతులను అందజేశారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ కాకా సుబ్రమణ్యం మాట్లాడుతూ ప్రాచీన సంప్రదాయాలు తెలియడంలో అతి పెద్ద పండుగ సంక్రాంతి పండుగ అని, కుటుంబంలో అందరిని కలిపే పండుగ గురించి వారికి తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల గౌరవ సలహాదారులు రామమోహన్, ఉపాధ్యాయులు హజరత్ యాదవ్, హరి కుమార్, కరీం బాష, సునీత, మౌనిక, యశోద, దేవి, భవ్యశ్రీ, వసంతతో పాటు పలువురు సంక్రాంతి పండుగ విశిష్టత గురించి విద్యార్థులకు తెలియజేసి స్వీట్లు పంపిణీ చేశారు.

## భాష్యం పాఠశాలలో సంక్రాంతి సంబరాలు

**బద్వేలు అర్బన్, జనవరి 11 ప్రభాతవార్త :**



పట్టణంలోని భాష్యం పాఠశాలలో ముందస్తు సం క్రాంతి వేడుకలను పాఠశాల కరస్పాండెంట్ వెంకట సు బ్బారెడ్డి ఆధ్వర్యంలో ఘనం గా నిర్వహించారు. పాఠశాల ప్రాంగణంలో పలువురు విద్యార్థులు వివిధ రకాల వేషధారణలతో అందరినీ అల రించారు. అనంతరం వివిధ రకాల రంగవల్లులను విద్యార్థులు తీర్చిదిద్దారు. ము గ్గుల పోటీలలో విద్యార్థులు పోటాపోటీగా పలువురిని ఆకట్టుకునే విధంగా రంగవల్లులను తీర్చిదిద్దడం జరిగింది. ముగ్గుల పోటీలలో పాల్గొన్న విద్యార్థిను లకు బహుమతులు అందజేశారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ కుంచాల వెంకట సుబ్బారెడ్డి మాట్లాడుతూ సంక్రాంతి పండుగ అనే ప్రతి సంవత్సరం జన వరి నెలలో మాత్రమే వస్తుందని, జ్యోతిష్య శాస్త్రం ప్రకారం సూర్యుడు దక్షిణా యనమును పూర్తి చేసుకొని ఉత్తరాయణంలోకి ప్రవేశించేటపుడు సూర్యుడు ఈ మకర రాశిలోనికి సంక్రమణను సంక్రాంతి పండుగగా జరుపుకోవడం జరుగుతూ వస్తుందన్నారు. ఈ ఉత్తరాయణ కాలం పుణ్య కాలం కుల, మతాలకు అతీతంగా రైతులు పంట దిగుబడి ద్వారా డబ్బు చేతికొచ్చిన తరువాత సంతోషంగా జరు పుకునే అతి పెద్ద పండుగ సంక్రాంతి పండుగ అని, ఈ పండుగను ఆనందంగా జరుపుకోవడం జరుగుతుందని విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్ కుంచాల సౌమ్య, ప్రధానోపాధ్యాయుడు ఆసిఫ్ బాష, ఉపా ధ్యాయినీ, ఉపాధ్యాయులు బీరం సుబ్బారెడ్డి, రంగనాయకులు, శ్రీనివాసులు, జయసుబ్బారెడ్డి, రంగయ్య, నారాయణ, ప్రసన్న కుమార్, లక్ష్మీదేవి, గౌరి, కస్తూ రి, భవాని, వెంకటసుబ్బమ్మ, రామి, చంద్రకల, ప్రసన్న సాయి, ఫాతిమా,శ్వేత, నారాయణమ్మతో పాటు పలువురు పాల్గొన్నారు.

## పిఎం కిసాన్ ఈ-కెవైసి చివరి తేది జనవరి 15

**ఎఒ శ్రీకర్**

**చిట్వేలి, జనవరి 11 ప్రభాతవార్త**

పిఎం కిసాన్ ఈ-కెవైసిని రైతులు ఈ నెల 15వ తేదీ లోపల చేయించుకోవాలని మండల ఎఒ శ్రీకర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని 13 రైతు భరోసా కేంద్రాల పరిధిలో గల రైతులు పిఎం కిసాన్‌కు సంబంధించి 3896 మంది ఈ-కెవైసి చేయించుకున్నారని, ఇంకా 1356 మంది రైతులు ఈ-కెవైసి చేయించలేదని సత్వరమే గడువు లోపల పూర్తి చేయించుకోవాలని తెలిపారు.2022-23 సంవత్సరానికి రబీ సాగుకుగాను ప్రతి రైతు తన పంటను ఈ పంట నమోదు చేయించుకోవాలని అన్నారు. మైలపల్లె పంచాయతిలోని ఆరన్‌బికె పరిధిలో ఈక్రాప్ చేస్తున్న వ్యవసాయ క్షేత్రాన్ని ఎఒ శ్రీకర్ సందర్శించి రైతులకు తగు సలహాలు, సూచనలు ఇచ్చారు.

## సాయి చైతన్యలో పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు

**బద్వేలు అర్బన్, జనవరి 11 ప్రభాతవార్త :**



పట్టణంలోని మైదుకూరు రోడ్‌లోని సాయి చైతన్య ఇంగ్లీ ష్ మీడియం పాఠశాలలో సం క్రాంతి పండుగను పురస్కరిం చుకొని బుధవారం పాఠశాల ఆవరణంలో రంగవల్లుల పోటీలు నిర్వహించారు. విద్యార్థులు సంక్రాంతి విశిష్టతతో కూడిన పలు రకాల రంగవ ల్లులు పలువురిని ఆకట్టుకునే విధంగా తీర్చిదిద్దారు. రంగవల్లులలో మంచి ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు ప్రత్యేక బహు మతులు అందజేశారు. రంగవల్లులలో పాల్గొన్న ప్రతిఒక్కరికీ కన్సోలేషన్ బహు మతులు అందజేశారు. అలాగే పాఠశాల ఆవరణంలో సంక్రాంతి పండుగ ఉట్టిప దేలా ముగ్గుల పోటీలే కాకుండా విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు ధరించి బోగి మంటలు, గొబ్బిళ్ళ పాటలతో పాటు పలు రకాల నృత్య ప్రదర్శనలు పలువురిని ఆకట్టుకునేలా నిలిచాయి. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ సౌజన్య లక్ష్మి మా ట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలలో, క్రీడలలో, ఆర్ట్స్‌లో, అన్ని రంగాలలో కూడా ఉత్సా హంగా రాణించాలని, అప్పుడే విద్యార్థు లు చేపట్టేటటువంటి పలు కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకుంటాయన్నారు. సంక్రాంతి పండుగ పురస్కరించుకొని ప్రతిఒక్కరూ సాంప్రదాయ దుస్తులు ధరించి సంక్రాంతి పండుగను సంతోషంగా జరుపుకోవాలని విద్యార్థులకు పలు రకాల సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృంధం, విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

